76809 94755 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2016-18

రాజధాని వార్తలు దినపత్రికలో
పనిచేయుటకు సబ్ ఎడిటర్లు, రాష్ట్రవ్యాప్తంగా ఎడ్వర్టైజ్‌మెంట్
ఎగ్జిక్యూటివ్, రిపోర్టర్‌లు కావలెను
అనుభవాన్ని బట్టి ఆకర్షణీయమైన
జీతం ఇవ్వబడును.
76809 94755
rajadhanivartalu1@gmail.com

# రాజధాని వార్తలు

Voice of Voiceless

Dr. DWIBHASHYAM KASI VISHWANATH TEJASWI
ఏపీలో ప్రఖ్యాతిగాంచిన చింతలూరు ఆయుర్వేద వైద్యులు,
సంతానరాహిత్య సమస్యలకు
సంప్రదించండి
ph : 90329 90138, 93939 90138
email :dr.d.vishwanath@gmail.com
AYYAPPA AYURVEDIC SYNDICATE
Visakhapatnam

అమరావతి సంపుటి : 4 సంచిక 13, పేజీలు 4, వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక సోమవారం 17 - ఆదివారం 23 డిసెంబర్, 2018

వివరాలు2లో...



'ఇజ్తెమా' ముస్లీంల సమ్మేళనం

వివరాలు3లో...



మిస్ వరల్డ్ మెక్సికో వెనెస్సా

వివరాలు4లో...



మొఘలుల కాలంలో క్రిస్మస్ సంబరాలు

వివరాలు4లో...



కేసీఆర్ బలం ఆయనే..

# దూసుకొస్తున్న 'పెథాయ్'

- తుపానుగా మారిన తీవ్రవాయుగుండం
- నేడు,రేపు అతిభారీ వర్షాలు
- గంటకు 80 నుంచి 110 కిమీ వేగంతో బలమైన గాలులు



**రాజధాని వార్తలు, అమరావతి :** ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం తుపానుగా మారింది. ప్రస్తుతం చెన్నైకి 775 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. 'పెథాయ్'గా నామకరణం చేసిన ఈ తుపాను ముందస్తు అంచనాల ప్రకారం కళింగపట్నం వద్ద తీరం దాటే అవకాశం ఉంది. తూర్పుగోదావరి, ఉత్తర కోస్తాంధ్ర మధ్య తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ నెల 17 సాయంత్రం పెథాయ్ తీరం దాటనుంది. ఈ ప్రభావంతో మరో 24 గంటల్లో కోస్తాంధ్ర అంతటా మోస్తరు నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కోస్తాంధ్ర తీరం వెంబడి 50 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తున్నాయి. అలల ఉద్ధృతి పెరిగే సూచనలు ఉనట్లు ఇన్‌కాయిస్ హెచ్చరికలు జారీ చేసింది. పెథాయ్ తుపాను నేపథ్యంలో వాతావరణశాఖ అధికారులు కోస్తాంధ్ర జిల్లాలతో పాటు తమిళనాడు, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు హెచ్చరికలు జారీ చేశారు. 15న కోస్తాంధ్ర, ఉత్తర తమిళనాడులో కొన్నిచోట్ల భారీ వర్షాలు, 16, 17ల్లో కోస్తాలోని పలుచోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు, 17 కోస్తాతో పాటు ఒడిశా, దక్షిణ ఛత్తీస్‌గఢ్ మీద కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని చెప్పారు. శనివారం నుంచే కోస్తా తీరంలో గాలుల తీవ్రత ఉంటుందని చెబుతున్నారు. 16 నుంచి గంటకి 80 కి.మీ నుంచి 110 కి.మీ వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.


**కడలి బీభత్సం..**

గుంటూరు జిల్లా నిజాంపట్నం తీరం నుంచి సముద్రంలో వేటకు వెళ్లిన పడవల్లో చాలావరకు ఒడ్డుకు చేరినా, ఆరు పడవలు మాత్రం ఇంకా సముద్రంలోనే ఉన్నాయి. వీటిలో సుమారు 50 మంది వరకు మత్స్యకారులు ఉన్నారని అంచనా. కాగా, పాలకాయితిప్ప గ్రామసమీపంలోని శుక్రవారం సముద్రం అల్లకల్లోలంగా మారింది. సముద్రతీరం, సాగరసంగమానికి వెళ్లే యాత్రికులను లోపలికి వెళ్లకుండా గేట్లను మూసివేశారు. కాగా, తుఫాన్ వార్తలతో కోస్తా రైతులు చెందుతున్నారు. పంట చేతికొచ్చే దశలో తుఫాన్ ఏం చేస్తుందోనని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ నేపథ్యంలో విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రానికి గడచిన మూడు రోజుల నుంచి రైతులనుంచి ఫోన్‌లు అధికంగా వస్తున్నాయి.

**డిసెంబరులో కోస్తాకు తుపాన్లు రావు**
**125 ఏళ్లలో నాలుగోతుపాను**

కోస్తాకు తుఫాన్‌లు డిసెంబరులో అరుదుగా వస్తుంటాయి. ఆ ప్రాంతంలో తుఫాన్‌లు ఏర్పడేందుకు వాతావరణం అనుకూలంగా ఉండకపోవడమే కారణం. 1965 డిసెంబరు 30న విశాఖపట్నానికి దక్షిణాన ఒక తుఫాన్ తీరం దాటింది. 1985 డిసెంబరు 13న శ్రీహరికోట వద్ద తీవ్ర తుఫాన్ ఒకటి తీరం దాటింది. 2003 డిసెంబరు 15న మచిలీపట్నం వద్ద, 2010 డిసెంబరు 12న మళ్లీ మచిలీపట్నం సమీపంలోనే మరో తుఫాన్ తీరం దాటింది. మళ్లీ ఎనిమిదేళ్ల తరువాత తాజాగా ఈనెల 17న 'పెథాయ్' దక్షిణ కోస్తాలో తీరం దాటనున్నది.

## సర్వసన్నద్ధంగా ఉండండి :చంద్రబాబు



**రాజధాని వార్తలు, అమరావతి :** 'పెథాయ్' తుపాను పరిస్థితులపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉందని అధికారులు ఆయనకు వివరించారు. జిల్లాల్లో తుపాను ముందస్తు సన్నద్ధతలపై సీఎం ఆర్టీజీఎస్ నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఎలాంటి పరిస్థితి ఎదుర్కోవడానికైనా సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ప్రాణనష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్రపునేఠా దీనిపై ప్రత్యేక దృష్టి సారించి యంత్రాంగంతో నిత్యం పరిస్థితిని సమీక్షిస్తున్నారు. తీవ్ర వాయుగుండం ఈ రోజు మధ్యాహ్నం తుపానుగా రూపాంతరం చెందే అవకాశం ఉన్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. వాయుగుండం మార్పులను అనుక్షణం గమనించాలని అధికార యంత్రాంగాన్ని సీఎం ఆదేశించారు. ఆర్టీజీఎస్‌లో తుపాను పరిస్థితి ఎదుర్కో వడానికి అన్ని ఏర్పాట్లు చేశామని అధికారులు వివరిం చారు. పరిష్కార వేదిక 1100 కాల్ సెంటర్ నుంచి తుపాను జాగ్రత్తల సందేశాలు జారీ చేయాలని, ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజలకు నిరంతరం హెచ్చరికలు పంపాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా వారి పడవలు తీరంలోనే నిలిపివేయాలని సూచించారు. తుపాను సంబంధిత విభాగాల అధికారులు ఆర్టీజీఎస్‌లో ఉంటూ పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. తుపాను నేపథ్యంలో రాత్రిపూట కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలు పనిచేయాలని ముఖ్యమంత్రి స్పష్టంచేశారు.

## పోలవరం కాంక్రీట్ పనులు వాయిదా: దేవినేని



**రాజధాని వార్తలు, అమరావతి :** ఆది,సోమవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈ కారణంగా పోలవరం ప్రాజెక్ట్ వద్ద రికార్డ్ స్థాయి కాంక్రీట్ పనులు జనవరికి వాయిదా వేస్తున్నట్లు మంత్రి దేవినేని ఉమ ప్రకటించారు. నాలుగేళ్లలో పోలవరం ప్రాజెక్ట్ కోసం రూ. 10,069 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. కేంద్రం నుంచి ఇంకా రూ. 3,342 కోట్లు రావాల్సి ఉందన్నారు. ఎప్పటికప్పుడు కేంద్ర జల సంఘానికి నివేదికలు, లెక్కలు పంపిస్తున్నామని మంత్రి తెలిపారు. కేంద్రం ఉద్దేశ పూర్వకంగానే నిధుల విడుదలలో జాప్యం చేస్తోందని విమర్శించారు. బకాయి నిధులను వెంటనే విడుదల చేస్తే నిర్వాసితులకు సాయం చేస్తామన్నారు. పోలవరం డీపీఆర్-2ను కేంద్రం ఆమోదించడం లేదని మంత్రి తెలిపారు. ఇప్పటి వరకు 62.16 శాతం పోలవరం పనులు పూర్తి అయినట్లు చెప్పారు. తమ మీద కక్షతో నిధులు నిలిపివేసి రైతులు, ప్రజలకు అన్యాయం చేయొద్ద న్నారు. పోలవరం నిర్వాసితులందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తున్నామని దేవినేని అన్నారు. కేసీఆర్, మోదీతో జగన్ కుమ్మక్కయ్యారని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్ట్‌ను అడ్డుకునేందుకు జగన్ అనేక కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. పక్క రాష్ట్రాలను రెచ్చగొట్టి కోర్టుల్లో కేసులు వేయిస్తున్నారన్నారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తయితే జగన్‌కు రాజకీయ మనుగడ ఉండదని దేవినేని ఉమ వ్యాఖ్యానించారు.

## 'హజ్' దరఖాస్తుకు 19 వరకు గడువు పెంపు



**రాజధాని ప్రతినిది, అమరావతి :** హజ్ యాత్రికులు దరఖాస్తు చేసేందుకుగాను గడువును ఈనెల 19 వరకు పొడిగించినట్లు ఏపీ రాష్ట్ర హజ్ కమిటీ ఈఓ ఎండీ. లియాఖత్ తెలిపారు. ఈ మేరకు మంత్రి ఫరూక్ కేంద్ర హజ్ కమిటీకి లేఖ రాశారని వెల్లడించారు. పాస్‌పోర్టు సమస్యలు; ఆర్థిక ఇబ్బందులతో పలువురు దరఖాస్తు చేసుకోలేకపోయారని కేంద్ర హజ్ కమిటీ దృష్టికి తీసుకెళ్లినట్టు లియాఖత్ ఒక ప్రకటనలో తెలిపారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర హజ్ కమిటీ దరఖాస్తు గడువును 19వ తేదీ వరకు పొడిగించిందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని హజ్ యాత్రికులకు లియాఖత్ సూచించారు.

## వరుసగా మూడో రోజూ..

- లోక్‌సభను స్తంభింపజేసిన టీడీపీ ఎంపీలు
- రాష్ట్ర హక్కుల కోసం పట్టు
- కొనసాగిన నిరసనలు.. సభ 17కి వాయిదా



**న్యూఢిల్లీ :** పార్లమెంటు శీతాకాల సమావేశాలు సజావుగా సాగడం లేదు. టీడీపీ ఎంపీలు వరుసగా మూడో రోజూ నిరసనల హోరుతో లోక్‌సభను అట్టుడికించారు. దీంతో ఎలాంటి కార్యకలాపాలు జరగకుండా సభ సోమవారానికి (17వ తేదీ) వాయిదా పడింది. ఉదయం సభ ప్రారంభమైన వెంటనే టీడీపీ ఎంపీలు అశోక్‌గజపతిరాజు. మాల్యాద్రి శ్రీరామ్, రామ్మోహన్‌నాయుడు, కొనకళ్ల నారాయణ, రవీంద్ర బాబు, అవంతి శ్రీనివాస్, శివప్రసాద్, గల్లా జయదేవ్, నిమ్మల కిష్టప్ప, మురళీమోహన్ తదితరులు వెల్‌లోకి వచ్చి ఆందోళన చేశారు. ఆంధ్రప్రదేశ్ హక్కులు

- మిగతా 3 లో

## నిర్లక్ష్యపు నీడల్లో అంగన్‌వాడీలు

**అప్‌గ్రేడ్ కోసం ఎదురుచూపులు**



**రాజధాని వార్తలు, అమరావతి :** అంగన్‌వాడీ కేంద్రాలు నిర్లక్ష్యనికి నిలుపుటద్ధంగా దర్శనమిస్తున్నాయి. మాతా శిశు సంరక్షణ కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతున్నా ఆశించిన ఫలితాలు రావటం లేదు. బాలింతలతోపాటు చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు అంగన్‌వాడీలు ఏర్పాటు చేసినా సర్కారు వాటి ఆలనా, పాలన విషయంలో మాత్రం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోంది. దీంతో ఐసీడీఎస్ ఫలాలు పూర్తి స్థాయిలో లబ్ధిదారులకు

# సంక్రాంతికి రెడీ అవుతున్న పందెంరాయుళ్లు




**రాజధాని వార్తలు, తణుకు :** సంక్రాంతి పండుగ అనగానే పందెంరాయుళ్ల కు మాత్రం గుర్తుకొచ్చేది మాత్రం కోడి పందెలు. ఈసారి సంక్రాంతి కి నెల రోజుల ముందు నుంచే గోదావరి జిల్లాల్లో కోడి పందెలు- కోతాట- గుండాటలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి.

ఈ ఏడాది ఎన్నికల సంవతర్సరం కావడంతో తమకు అడ్డూ అదుపు ఉండదనే ధీమాలో పందెంరాయుళ్లు ఉన్నారు. గతం లో పందెం కోళ్ల పెంపకం ఎక్కడో జరిగేవి. కానీ ఈ సారి బరుల వద్దే పెంచుతూ ఏ క్షణమైనా పందాల నిర్వహణకు సిద్ధమంటున్నారు. ఉదాహరణకు తణుకు నియోజకవర్గాన్నే తీసుకుంటే గతేడాది ఇరగవరం మండలంలో ఎనిమిది బరులు- అత్తిలి మండలంలో ఆరు బరులు తణుకు పట్టణం- రూరల్ మండలంలో 20 బరుల్లో పందాలు జరిగినట్లు పోలీసుల నివేదికలో వెల్లడించారు. ఈ సంవత్సరం ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు.

గతంలో కోడి పుంజులను ఇళ్ల వద్ద- చేల గట్ల వద్ద పెంచేవారు. ఇప్పుడు బరులు జరిగే ప్రాంతంలో పుంజులకు శిక్షణ ఇస్తున్నారు. గిరాకీ ని బట్టి ప్రత్యేక ఫారాలు ఏర్పాటు చేస్తున్నారు. సంవత్సర కాలంగా ఖరీదైన ఆహారంతో పాటు ఈత- ఇతర వ్యాయమాలు నేర్పిస్తున్నారు. రాగులు- జొన్నలు- ఇతర ధాన్యాలతో పాటు జీడిపప్పు- బాదం- మటన్ కీమా పెట్టి పందాలకు సిద్ధం చేస్తున్నారు.

కోడి పందాలతోనే మూడు రోజుల బరుల నిర్వహణ గిట్టుబాటు కాదని- గుండాట- కోతాట వంటి వాటి ద్వారా ఆదాయం పొందాలనే ఆలోచనలో నిర్వాహకులు ఉన్నారు. గతంలో ఒక్కో బరి నిర్వాహకుడు రూ.1లక్ష నుంచి 10లక్షల వరకూ ఆర్జించినట్లు సమాచారం. కోడిపందాల వద్దనే గుండాట- పేకాట వంటి ఏర్పాటు చేసుకునే పనిలో బరుల నిర్వాహకులు ఉన్నారు. కోడి పందాలను చూసేందుకు రాజకీయ- సినీ ప్రముఖులు వస్తుండంతో అధికారులు ఏమి చేయలేక పోతున్నారు. సంప్రదాయ ముసుగు లో కొందరి పోలీసులకు సొమ్ము ముడుతుండటంతో పోలీస్- రెవిన్యూ అధికారులు కూడా చూసిచూడనట్లు వ్యహరిస్తోంది.

# సేవలకు స్ఫూర్తి... కొమ్మారెడ్డి నాని



**రాజధాని వార్తలు, అమరావతి :** ప్రార్థించే పెదవులకన్నా సాయం చేసే చేతులు మిన్న అని చెప్పిన మదర్ థెరిసా సూక్తిని అక్షరాల వంట బట్టించుకున్నారు. మంగళగిరి పట్టణంలోని కొమ్మారెడ్డి సేవాసమితి మేనేజింగ్ ట్రస్టీ, నాని స్వీట్స్ అధినేత కొమ్మారెడ్డి సుబ్రహ్మణ్యం (నాని), సంపాదించిన ధనంలో కొంతభాగం సేవా కార్యక్రమాలకు, ఆ పన్నులకు చేయూత అందించేందుకు వినియోగించాలనేది ఆయన లక్ష్యం. అదెలా కార్యరూపం దాల్చిందంటే... నాని స్వస్థలం కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు దగ్గర కౌతవరం.

కొమ్మారెడ్డి వెంకటేశ్వరరావు, సుబ్బమ్మ దంతపతులకు 1961 డిసెంబరు 14న నాని జన్మించారు. ఏడు సంవత్సరాల పసిప్రాయంలోనే నాని విజయవాడలోని ఓ స్వీట్లు షాపులో చేరారు. మూడున్నర దశాబ్దాల కిందట ఉపాధి కోసం నాని మంగళగిరికి చేరారు. స్థానికంగా ఉన్న ప్రముఖ స్వీట్ షాపులో కార్మికుడిగా జీవితం ప్రారంభించారు. మూడుళ్ళపాటు పనిచేసిన అనుభవంతో, తన భార్య తోడుగా నిలవడంతో నాని సొంతంగా మిఠాయి బండి పెట్టుకున్నారు. అలా వివిధ రకాల స్వీట్ల తయారీలో అనుభవానికి తోడు వినియోగదారుల ఆదరణ మిత్రుల సహకారంతో అనతికాలంలోనే నాని స్వీట్స్‌ను ప్రారంభించారు.

**సేవా కార్యక్రమాలకు బీజం...**

అమ్మ సుబ్బమ్మ సంస్మరణార్థం ప్రతియేటా వర్ధంతి రోజు అన్నదానం చేస్తూ, మంగళగిరి, పరిసర ప్రాంత దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లు కాలిపర్స్‌లు ఇవ్వడం వంటి సేవా కార్యక్రమాలను మొదలు పెట్టారు. అలా ప్రారంభమైన వారి కార్యక్రమాలకు వేదికగా కొమ్మారెడ్డి సేవాసమితికి 1998 సెప్టెంబరు 6న బీజం వేశారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు వావిలాల గోపాలకృష్ణయ్య సువర్ణ హస్తాలతో ఈ సేవాసమితి జీవం పోసుకుంది. నిరాడంబరతలో వావిలాల గోపాలకృష్ణయ్య

- మిగతా 2 లో



## రాజధాని వార్తలు కలం

# అది నిజమేనా ?

రాఫెల్ కుంభకోణంలో సరైన ఆధారాల్లేవన్న సాకుతో విచారణ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించడం సాంకేతికపరమైన అంశమే అయినప్పటికీ, ఇది దేశ ప్రజలను షాక్‌కు గురిచేసింది. దీనిపై సీనియర్ సుప్రీంకోర్టు లాయర్ ప్రశాంత్ భూషణ్ కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. రక్షణ రంగం కోసం 126 యుద్ధ విమానాలను కొనుగోళ్లలో ఇంతకు ముందు యూపీఏ ప్రభుత్వ ఒప్పందాన్ని ఎందుకు రద్దు చేశారన్న అంశంపై విచారణకు సుప్రీం పర్యవేక్షణలో సిట్ ఏర్పాటు చేయాలని పిటిషన్‌దారుల్లో ఒకరైన ప్రశాంత్ భూషణ్ కోరారు. దీనిపై సుప్రీంకోర్టు వెలువరించిన దాటవేత ధోరణి తీర్పును ఆయన పూర్తిగా వ్యతిరేకిస్తుండగా, దేశ ప్రజలంతా ఆయనతో ఏకీభవిస్తున్నారు. అనుమానం
ఉందని పిటిషన్ దాఖలు చేస్తే ఖచ్చితంగా కోర్టులు స్పందిస్తూ, ప్రజల్లో అత్యున్నత కోర్టు విశ్వసనీయత పెంచుకునే విధంగా వ్యవహరించాల్సి ఉంది.. ఎందుకంటే ప్రజాస్వామ్యంలో మూడో స్థంభం న్యాయవ్యవస్థే గనుక. ఈ నెల 2న మాజీ న్యాయమూర్తి జస్టిస్ కురియన్ మాట్లాడుతూ అత్యున్నత న్యాయస్థానం మాజీ చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా తీర్పులపై బయటి వ్యక్తుల ఒత్తిడి ఉందని తెలపారు. ఆయన వ్యాఖ్యల్లో నిజముందని ప్రజలు భావిస్తున్నారు. అధికారం కోసం రాజకీయపార్టీలు ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటైన అన్ని వ్యవస్థలనూ భ్రష్టు పట్టిస్తున్నాయనడానికి ఇదొక తాజా ఉదాహరణ. ఇప్పటికే సెంట్రల్ ఇన్వెస్టిగేటింగ్ బ్యూరో (సీబీఐ), రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఎన్నికల సంఘం (ఈసీ) ప్రణాళికాసంఘం (ప్రస్తుత నీతి అయోగ్) అనేక విమర్శలకు లోనయ్యాయి. దీని ప్రతిఫలాన్ని ఐదురాష్ట్రాల ఎన్నికల్లో అనుభవించినప్పటికీ ఇంకా బీజేపీ ప్రభుత్వం కళ్లుతెరవక పోవడం దాని పతనాన్ని సూచిస్తోంది. ఫ్రాన్స్‌కు చెందిన డసాల్ట్ ఏవియేషన్ ఒప్పందానికి ముందు ప్రధాని మోడీ కేంద్రంలోని డిఫెన్స్ ప్రొక్యూర్‌మెంట్ ప్రక్రియను పట్టించుకోలేదు. చట్టప్రకారం యుద్ధ విమానాల కొనుగోలు కోసం డిమాండు చేస్తూ తొలుత ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ చీఫ్ నుంచి ప్రతిపాదనను తీసుకోవాలి. వీటిన్నింటినీ కేంద్ర పట్టించుకోకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంది. దశలవారీగా 126 యుద్ధ విమానాలు కొనుగోళ్లు చేయాల్సి ఉండగా, కేవలం 36 విమానాలను మాత్రమే అత్యవసరంగా కొంటూ ప్రభుత్వ సంస్థ హిందుస్థాన్ ఏవియేషన్‌ను కాదని రిలయన్స్ డిఫెన్స్‌కు ఈ ఒప్పందాన్ని కట్టబెట్టడపై దేశ ప్రజలు ఆగ్రహంగా ఉన్నారు. దీనిలో రూ.20 వేల కోట్లు నష్టం జరిగిందని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. ఈ ఒప్పందంపై ఫ్రాన్స్, భారత్‌లో పెద్ద దుమారాలు రేగాయి. ఒప్పందంనాటి ఫ్రాన్స్‌అధ్యక్షుడు హొలాండ్ అక్కడి పత్రికలకు ఇచ్చిన ఇంటూర్వ్యూలో హిందూస్తాన్ ఏవియేషన్‌ను కాదని, రిలయన్స్ డిఫెన్స్‌కు ఒప్పందాన్ని ఇవ్వడంలో ఫ్రాన్స్ ప్రమేయం లేదని తేల్చి చెప్పగా, ప్రస్తుత అధ్యక్షుడు మాక్రాన్ ఈ విషయంలో తాను తలదూర్చనని స్పష్టం చేశారు.అయితే భారత ప్రభుత్వం మేరకు డాసాల్ట్ సీఈవో మాట్లాడుతూ మేమే రిలయన్స్‌ను సూచించామని చెప్పడం వెనుకు భారత ప్రభుత్వం ఒత్తిడి ఉందన్నది స్పష్టం. 126 యుద్ధ విమానాలను కొనుగోళ్లు చేయాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఒత్తిడి చేయలేదని, దేశ భద్రత దృశ్యా పూర్తి వివరాలను వెల్లడించమని అడగలేం అని సుప్రీంకోర్టు తీర్పు వెలువరించడం అధికార బీజేపీకి కలిసి వచ్చింది. దీంతో దేశప్రజలకు కాంగ్రెస్ అధినాయకుడు రాహుల్ క్షమాపణ చెప్పాల్సిందే అంటూ బీజేపీ బీరాలు పలుకుతోంది. అయితే పార్లమెంటరీ కమిటీ విచారణకు మాత్రం కేంద్రం ముందుకు రావడం లేదు.
న్యాయం గెలుస్తుందన్న మాట నిజమేకాని,
గెలిచిందంతా నిజంకాదు..
అని శ్రీశ్రీ చెప్పిన వ్యాఖ్యం ఇప్పుడు అందరికీ గుర్తుకొస్తోంది.దేశ ప్రతిష్టతను మంటగలుపుతూ ప్రధాని పదవిని దుర్వినియోగం చేస్తున్న మోడీకి తగిన బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది.

# ‘ఇజ్తెమా’ ముస్లింల సమ్మేళనం





ఇజ్తెమా అంటే ముస్లింల సమ్మేళనం. ఇది 1949 నుంచి జరుగుతోంది. ముస్లింలు అల్లాహ్‌తో భయభక్తులతో ఎలా ఉండాలన్నది ఈ మూడు రోజుల సమావేశాల్లో చర్చిస్తారు. సాధారణంగా మతపరమైన ప్రాథమిక అంశాలతోపాటు మంచి నడవడిక, తల్లిదండ్రులను ప్రేమతో ఆదరించడం, దాతృత్వానికి దేవుడు అందించే ప్రతిఫలం ఎలా ఉంటుందన్న విషయంతో ఢిల్లీ నుంచి వచ్చిన ఇమామ్‌లు భక్తులకు వివరించడంతో ఈ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. కర్నూలులో ఈనెల 8 నుంచి 10 వరకు ఇజ్తెమా జరిగింది.

‘ఆలమీ తబ్లీగి ఇజ్తెమా’కు 30 లక్షల మంది ముస్లింలు రాష్ట్రం నలుమూలల నుంచే కాక దేశ, విదేశాల నుంచి రావడంతో ఈ ప్రాంతం జనసంద్రాన్ని తలపించింది.

ఆధ్యాత్మిక చింతన, సన్మార్గ బోధన లక్ష్యంగా అనేక మంది ముస్లింలు ఒకచోట కలిసి సోదరభావంతో నిర్వహించుకునే సమ్మేళన కార్యక్రమమే ‘ఇజ్తెమా’ అని నిర్వాహకులు తెలిపారు. కర్నూలు శివారులోని తాండ్రపాడు గ్రామ సమీపంలో 2000 ఎకరాల్లో అఖిల భారత ఇజ్తెమా కమిటీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. మూడు రోజుల ఈ వేడుకలో అల్లా మార్గం, ఇస్లాం మూలసూత్రాలు, ఖురాన్ పఠనం, ప్రేమ, దయ, సోదరభావం లాంటి అంశాలను మతపెద్దలు బోధించారు.ఇజ్తెమాలో పాల్గొనటాన్ని ముస్లింలు అతి ముఖ్యమైన అంశంగా భావిస్తారు. తమ జీవనం సన్మార్గంలో సాగడంలో ఇది ముఖ్య భూమిక పోషిస్తుందన్నది వారి నమ్మకం.ఢిల్లీ నుంచి వచ్చిన మతపెద్ద మౌలానా మహమ్మద్ సాద్ సాబ్‌తోపాటు పలువురు ఇస్లాం మత ప్రచారకులు ఈ సమ్మేళనంలో పాల్గొని, ఆధ్యాత్మిక ప్రబోధంతోపాటు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా, ఇండొనేషియా, మలేషియా, ఇతర దేశాల ముస్లింలు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇస్లాం ఆధ్యాత్మిక సంస్థలు ఏటా ఆయా దేశాల్లో, ఆయా ప్రాంతాల్లో ఈ సమ్మేళనాన్ని నిర్వహిస్తుంటాయి. 2014లో మధ్యప్రదేశ్ లోని భోపాల్ లో జరిగిన ఇజ్తెమా ప్రపంచంలోనే అత్యంత పెద్ద సమ్మేళనంగా గుర్తింపు పొందింది.కర్నూలు ఇజ్తెమా దక్షిణాదిలోనే అతిపెద్ద ముస్లిం సమ్మేళనమని ఇజ్తెమా నిర్వాహక కమిటీ తెలిపింది.


ఇజ్తెమాలో పాల్గొనేవారి కోసం ప్రభుత్వం 116 ఎకరాల్లో టెంట్లు ,600 ఎకరాల్లో పార్కింగ్ , 45 ఫుడ్ స్టాల్స్ , వైద్య కేంద్రం, 3 వేల మంది వాలంటీర్లను ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యుడు ప్రొఫెసర్ మెహమ్మద్ జవహరిన్ బాషా తెలిపారు.

కర్నూలు జిల్లాకు చెందిన ముస్లిం మతపెద్దల విజ్ఞప్తి , మైనారిటీ, వైద్యవిద్యాశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ చొరవతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి అధికారికంగా ఏర్పాట్లు చేసింది. ఇజ్తెమా కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.10 కోట్ల నిధులు మంజూరు చేశారని మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంతో ప్రజల మధ్య విద్వేషాలు సమసిపోయి ప్రేమ, సోదరభావం నెలకొంటాయని ఫరూక్ చెప్పారు. చివరిరోజున విందు తర్వాత ఈ సమ్మేళనం ముగిసింది.

– ఖాన్

## ఎన్నికలు ఎప్పుడొచ్చినా రెడీ

**మంత్రి ఆది నారాయణరెడ్డి**



**రాజధాని ప్రతినిధి,అమరావతి :** రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బంపర్ మెజార్టీతో గెలుస్తామని పశు సంవర్ధక శాఖ మంత్రి ఆది నారాయణ రెడ్డి దీమా వ్యక్తం చేశారు. ఆయన వెలగపూడి సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో ప్రజాకూటమి ఎక్కడ విఫలమైందో విశ్లేషించుకుంటామన్నారు. తెలంగాణలో కన్నా ఏపీలో అభివృద్ధి ఎక్కువగా జరిగిందని రుణమాఫీ వంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలయ్యాయని చెప్పారు. పొరుగు రాష్ట్రంలో పోటీ చేయలేని వైసీపీ, జనసేన పార్టీలు అక్కడ కేసీఆర్ గెలిస్తే ఇక్కడ సంబరాలు చేసుకొన్నాయని విమర్శించారు. చంద్రబాబుకు కేసీఆర్ గిఫ్ట్ ఇస్తానని వ్యంగంగా మాట్లాడుతున్నారని.. దాన్ని అనుకూలంగా మార్చుకుంటామని ఆది నారాయణరెడ్డి తెలిపారు. రెండు మూడు నెలల ముందుగా ఎన్నికలు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. చంద్రబాబు పాలన దక్షతకు ప్రజలు పట్టం కడతారన్న విశ్వాసాన్ని మంత్రి వ్యక్తంచేశారు.




**మంగళవారం నాడు చిప్స్ కళాశాలలో గత మూడు రోజుల నుండి జరుగుతున్న రాష్ట్రస్థాయి ఫార్మసీ విద్యార్థుల, వివిధ రకాల క్రీడాపోటీల్లో, సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ, నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అంకమ్మ చౌదరి, కళాశాల ప్రిన్సిపాల్ విద్యాధర, డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య, నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ డాక్టర్ ఎం జగదీష్ కుమార్.**

**– కిరణ్ కుమార్, గుంటూరు**

### ఉద్యోగుల సమస్యల సాధన కోసం


## 28న జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నా

**ఏపీ జేఏసీ చైర్మన్ పి.అశోక్‌బాబు**



**రాజధాని ప్రతినిధి, అమరావతి :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు వెంటనే మధ్యంతర భృతి(ఐఆర్) ప్రకటించాలని, రెండో విడత డీఏ బకాయిలు చెల్లించాలని డిమాండు చేస్తూ ఈ నెల 28న అన్ని జిల్లా కలెక్టరేట్ల ఎదుట ధర్నా నిర్వహిస్తామని ఏపీ జేఏసీ చైర్మన్ పి.అశోక్‌బాబు వెల్లడించారు. విజయవాడ ఏపీఎన్జీవో హోమ్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ సెక్రటేరియట్ సమావేశాన్ని నిర్వహించారు. అశోక్‌బాబు మాట్లాడుతూ కమిటీలతో కాలయాపన చేయకుండా ఢిల్లీ ప్రభుత్వం తరహాగా సీపీఎస్ రద్దుపై తక్షణమే చంద్రబాబు ప్రకటన చేయాలని డిమాండు చేశారు. ఒప్పంద ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని, పొరుగు సేవల ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలన్న డిమాండ్లతో రాష్ట్ర వ్యాప్తంగా 28న ధర్నాలుకు పిలుపునిచ్చామని తెలిపారు. ఉద్యోగుల సమస్యల సాధన కోసం జనవరి 8, 9 తేదీల్లో నిర్వహించబోయే దేశవ్యాప్త సమ్మెకు మద్దతిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో జేఏసీ సెక్రటరీ జనరల్ సిహెచ్.జోసఫ్ సుధీర్‌బాబు, కో–చైర్మన్లు బాబురెడ్డి, రఘురామిరెడ్డి, డిప్యూటీ సెక్రటరీ జనరల్ చంద్రశేఖరరెడ్డి, సభ్యులు బండి శ్రీనివాసరావు, మణికుమార్, హరినాథ్, సాంబశివరావు, గోపాలకృష్ణ, నరసింహులు, వెంకటేష్‌బాబు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

## మంగళగిరిలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు



**రాజధాని వార్తలు, మంగళగిరి :** ప్రతి సంవత్సరము శ్రీమన్నారాయణుడు శ్రీదేవి, భూదేవి సమేతముగా వైకుంఠ ద్వారము వద్ద ముక్కోటి దేవతలు ఉత్తర ద్వారము వద్ద ముక్కోటి దేవతలు శ్రీస్వామి వారి దర్శనార్థము కొలువతీరి ఉంటారు. ఉత్తర ద్వారము ద్వారా దర్శించినవారు ముక్కోటి దేవతలను ఒక్కసారే, ఒకేచోట దర్శించిన మహత్తర భాగ్యమును పొందగలరు గరుడారూఢుడైన భక్తసులభుడు, ఆశ్రిత జనపక్షపాతియైన శ్రీస్వామివారు అభయ, మంగళశాసనములు తెలియపరచుచూ దర్శనమిస్తారు. ఈనెల 16-12-2018 ఆదివారం నుండి 15-01-2019 మంగళవారం వరకు వివిధ రకాల కార్యక్రమాలు జరుగును. దిగువ సన్నిధిని శ్రీస్వామి వారి ఆలయము నందు బంగారు దక్షిణావృతి శంఖముచే తీర్థం ఇవ్వబడును. 17వ తేదీన జాగరణ సందర్భంముగా రాత్రి 7:00 గం॥ ల నుండి కోలాటములు, విచిత్ర వేషధారణ. భరతి నాట్యములు, చెక్కభజన కార్యక్రమములు మరియు శ్రీ ఆకురాతి కోదండ రామయ్య గారిచే అన్నమాచార్య సంకీర్తనలు జరుగును.


**కార్యక్రమములు**

ఆదివారం 16-12-18 రాత్రి 7:00 గం॥లకు ‘ఆండాల్ ఉత్సవము’ (గ్రామసేవ) గ్రామోత్సవము ప్రారంభం, 17న సోమవారం రాత్రి 8:00 గం॥లకు శ్రీస్వామి వారికి “జగన్మోహిని” అలంకారము. రాత్రి 9:00గం॥లకు పుష్పక విమానముపై గ్రామోత్సవం జరుగును, రాత్రి1:00 గం॥ల నుండి 3:00 గం॥వరకు శ్రీ స్వామి వారికి తిరువంజనోత్సవ కార్యక్రమము తదుపరి తెల్లవారుజామున 4 గంటల నుండి రాత్రి 9 గం॥ల వరకు బంగారు దక్షిణావృత శంఖముచే తీర్థము ఇవ్వబడును.

18న మంగళవారం తెల్లవారుజామున 4గం॥ల నుండి మ.2:00గం॥ల వరకు బంగారు గరుడ వాహనముపై ఉత్తర ద్వార దర్శనం (వైకుంఠ ద్వారం) తదుపరి స్వామి వారి గ్రామోత్సవం, నమ్మళ్వార్ అధ్యయనోత్సవములు (కొరాయి ఉత్సవములు) 22 వరకు పరమ పదోత్సవం (కైంకర్యపరులు) జరుగును.

## రేషన్ డీలర్లకు ‘మిడ్డే’ కమీషన్లు..

**పౌరసరఫరాల శాఖ ఉత్తర్వులు జారీ**



**రాజధాని ప్రతినిధి, అమరావతి :** బకాయిలుగా ఉన్న మధ్యాహ్న భోజన పథకం బియ్యం కమీషన్లను రేషన్ డీలర్లకు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పౌర సరఫరాల శాఖ ఒక ప్రకటనను విడుదల చేసింది. రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు, పాఠశాలలకు మధ్యాహ్న భోజన పథకం అమలుకుగాను రేషన్ డీలర్లు బియ్యాన్ని పంపిణీ చేస్తుంటారు. ఇలా పంపిణీ చేసే బియ్యానికి ప్రభుత్వమే కమీషన్ చెల్లిస్తుంది. కొద్దీ నెలలుగా కమీషన్ రాలేదని రేషన్ డీలర్లు మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మూడు నెలల్లోగా డీలర్లకు బకాయిలు చెల్లించాలన్న మంత్రి అదేశాల మేరకు పౌర సరఫరాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

# సేవలకు స్ఫూర్తి... కొమ్మారెడ్డి నాని

**(మొదటిపేజీ తరువాయి)**

నానికి ఆదర్శం. ఇప్పటి వరకు వందలాది మందికి అవసరాన్ని బట్టి ట్రై సైకిళ్లు, కాలిపర్స్ పంపిణీ చేశారు. ట్రైసైకిళ్లు ఇచ్చి ఊరుకోకుండా వాటి నిర్వహణకు ప్రతినెలా కొంత డబ్బు ఇస్తుంటారు. 1990 నుంచి ప్రతియేటా వేసవిలో పాతబస్టాండ్ సెంటర్, యర్రబాలెంలో చలివేంద్రాలు నిర్వహిస్తున్నారు. వేసవిలో పాత బస్టాండ్ సెంటర్, యర్రబాలెంలో చలివేంద్రాలు నిర్వహిస్తున్నారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మంచినీటితోపాటు ఆ చతివేంద్రాల్లో మజ్జిగ కూడా అందజేస్తుండడం అవసరాలర్థుల పట్ల ఆయనలోని సామాజిక స్ఫూర్తిని చాటుతుంది. మంగళగిరి చుట్టుపక్కల గ్రామాల్లో 30 బోర్లు వేయించి ఆయా ప్రాంతాల్లో నీటి సమస్యకు పరిష్కారం చూపారు కొమ్మారెడ్డి నాని. ఎన్నో చోట్ల మొక్కలు నాటి వాతావరణ పరిరక్షణకు తన వంతుగా కృషి చేశారు. అలాగే అన్ని మత సంస్థల ప్రార్ధనా మందిరాలలో సౌకర్యాల కల్పనలో చేయూతనందించారు.





**నేత్ర వైద్య, ఆరోగ్య శిబిరాలు...**

కొమ్మారెడ్డి నాని, ప్రముఖ నేత్రవైద్య నిపుణులు డాక్టర్ ఎంఎన్‌రాజు తదితర వైద్య ప్రముఖులతో కలిసి మంగళగిరి పట్టణంలో పలుమార్లు నేత్ర వైద్య ఆరోగ్య శిబిరాలను ఏర్పాటుచేసి ఎంతో మందికి శస్త్రచికిస్తలు చేయించడమేకాకుండా కళ్లజోళ్లు, మందులు పంపిణీచేశారు. ఇంకా పలువురికి వ్యకిగతంగాను నేత్ర శస్త్రచికిత్సలు చేయించి కళ్లజోళ్లు అందించి ఎందరికో చూపును మెరుగుపర్చారు. 1999 సంవత్సరంలో అంబులెన్స్ సేవలను మాజీ మంత్రి డాక్టర్ ఎంఎస్ఎస్ కోటేశ్వరరావు సువర్ణహస్తాలతో ప్రారంభింపజేయించి ప్రాణాపాయస్థితిలో ఉన్న అనేకమంది సకాలంలో వైద్యశాలకు వెళ్లేందుకు వీలు కల్పించారాయన. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ఈ ప్రాంతంలో పోలీసు శాఖకు కూడా అంబులెన్స్ సేవలు ఉపయుక్తంగా ఉండేవి. అర్థరాత్రి వేళల్లో అంబులెన్స్ డ్రైవర్ అందుబాటులో లేకుంటే నాని గాని, వారి కుమారుడు రంగబాబు గాని క్షతగాత్రులను ఆస్పత్రికి తీసుకువెళ్లిన సందర్భాలకు కొదవలేదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు 106 అంబులెన్స్ సేవలు ప్రారంభించేతవరకు అందరికీ వీరి అంబులెన్స్ ప్రాణప్రదాయినిగా ఉండేది.

**శ్మశానవాటికల అభివృద్ధి.**

చాలా మంది సేవాకార్యక్రమాలు చేయడం సహజమే. అందరికీ భిన్నంగా శ్మశాన వాటికలను అభివృద్ధి చేయాలనే తలంపుకొమ్మారెడ్డి నానికి ఎలా కలిగిందనేది వీరి మాటల్లో!... మాస్వీటు షాపులో పనిచేసి ఓ కార్మికుడు చనిపోవడంతో ఆత్మకూరు రోడ్డులోని శ్మశాన వాటికలో అతని అంత్యక్రియలకు వెళ్లాను. ఆచారాల ప్రకారం దగ్గరలోని బావి వద్దకు స్నానా కోసం అతని బంధువులతో పాటు వెళ్లాను చెత్తాచెదారంతో ఉన్న ఆ బావిని కలుషిత నీటితోనే ఆ కార్యక్రమం ముగించాల్సివచ్చింది. మరణించినవారికి గౌరవంగా అంత్యక్రియలు జరిపించడం మన విధిగా నాకనిపించిది. అది మనసులో గట్టిగా నాటుకుపోవడంతో నా సేవాకార్యక్రమాలలో శ్మశానాల అభివృద్ధికి పెద్దపేట వేయాలనుకున్నాను. అప్పటి నుంచి నాని స్మశానాల అభివద్ధికి నడుం కట్టారు. ఆత్మకూరు రోడ్డు వీపర్స్‌కాలనీ శ్మశానంలో దహన ఏర్పాట్లతోపాటు రోడ్డులోని శ్మాసనవాటికలో దహన ఏర్పాట్లు ప్రహరీ, గేటు నిర్మాణంతోపాటు బోతు వేయించారు. వాటర్‌ట్యాంక్ ఏర్పాటు చేయడంతోపాటు ఏకశిల శివుని విగ్రహాన్ని నెలకొల్పారు. అలాగే తెనాలి రోడ్డులోని శ్మశానవాటికలో బోరు వేయించారు. బాపనయ్యనగర్ శ్మశానవాటికను మెరక తోలించడంతోపాటు ప్రహరీ, భారీగేటు నిర్మించి బోరు ఏర్పాటుచేశారు. అలా దశలవారీగా మంగళగిరి ప్రాంత శ్మశానాలలో సౌకర్యాలు ఏర్పాటుచేసి పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించారాయన, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల స్వచ్ఛభారత్ ప్రారంభానికి ముందే నాని దూరదృష్టితో ఈ కార్యక్రమాను అమలు చేయడం విశేషం ! ఇంతకుముందు ఈ ప్రాంత శ్మశానవాటికలకు ఆలనాపాలన లేకపోవడంతో బహిర్భూమిగా వాడే అపరిశుభ్ర పరిస్థితులు తాండవించేవి, పట్టణంలో ప్రముఖులు అయినా సరే ఆ కొద్దిసేపు అంతిమ సంస్కార కార్యక్రమాను ముక్కులు మూసుకుని బతుకుజీవుడా అంటూ ముగించి బయటపడాల్సిన పరిస్థితి ఉండేది. అప్తుల అంతిమ విషాదయాత్రను నుంచి శ్మశాన వాటికల్లో పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించిన కొమ్మారెడ్డి సేవాసమితి వినూత్న సేవలకు చిరునామాగా మారింది.

**రక్త దాతల గ్రూపు**

కొమ్మారెడ్డి సేవాసమితికి అనుబంధంగా 50 మంది పైగా రక్తదానం చేసే సభ్యులు ఉన్నారు. వీరి ఫోన్ నెంబరు : 08645-232718లో సంప్రదిస్తే అన్ని గ్రూపుల రక్తదాలను అవసరార్థులతో సమన్వయ పరుస్తున్నారు. ఈ సేవ సుమారు 25 సంవత్సరాలుగా కొనసాగుతోంది.

**ప్రజా సేవకులకు నివాళి...**

ఈ ప్రాంతంలో ప్రజా సేవకు పెట్టింది. పేరైన కారుమంచి వెంకటసుబ్బయ్య గారి విగ్రహాన్ని మంగళగిరి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోనూ, తొలి మున్సిపల్ చైర్‌పర్సన్ గోలి గోపాలరావు గారి విగ్రహాన్ని పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలోనూ, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు గారి విగ్రహాన్ని పాత బస్టాండ్ సెంటర్‌లోనూ ఏర్పాటు చేయడంఓ నాని పట్టుదల, కృషి ఎనలేనిది.

**బహుముఖ సేవలు...**

మంగళగిరి పట్టణ, పరిసర గ్రామాలకు సుపరిచితులైన కొమ్మారెడ్డి నాని ఓ పక్క స్వీటుషాపును వినియోగదారుల ఆదరణలో అగ్రగామిగా నిలపడమేకాకుండా పలు ప్రజాసంఘాలు, సంస్థలకు సేవలు అందిస్తున్నారు. మంగళగిరి హోటల్స్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబరుగానూ, ఏపీఎస్ ఆర్టీసి మంగళగిరి డిపో టీఎన్‌టీయూసి గౌరవాధ్యక్షులుగానూ తన విలువైన సమయాన్ని వెచ్చించి ఆయా రంగాల అభివృద్ధికి తన వంతు సేవలు అందిస్తున్నారు. వ్యాపార రంగంలో సేవను మిళితం చేసి వ్యాపార, సేవారంగాల్లో విశేషంగా రాణిస్తున్న కొమ్మారెడ్డి నాని మంగళగిరి, చుటుప్రకల గ్రామాల ప్రజలలో తనదైన ముద్ర వేసుకున్నారు. నిండైన మనసుతో సహకరిస్తూ, ప్రోత్సహించే కుటుంబ సభ్యులున్న నాని సామాజిక సేవా కార్యక్రమాల్లో తరిస్తున్నారు.

ప్రజల్లో నెలకొన్న మూఢనమ్మకాల వల్ల సేవా రంగాల్లో విశేషంగా రాణిస్తున్న కొమ్మారెడ్డి నాని మంగళగిరి, చుట్టుపక్కల గ్రామాల ప్రజలలో తనదైన ముద్ర వేసుకున్నారు. నిండైన మనసుతో సహకరిస్తూ ప్రోత్సహించే కుటుంబ సభ్యులున్న నాని సామాజిక సేవా కార్యక్రమాల్లో తరిస్తున్నారు. ప్రజల్లో నెలకొన్న మూఢనమ్మకాల వల్ల సేవారంగంలో ఎవరూ సాహసించనటువంటి శ్మశాన వాటికల అభివృద్ధి, మహాప్రస్థాన వాహన సౌకర్యం వంటి వైవిధ్యభరితమైన కార్యక్రమాలను నాని విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ప్రజాసేవ వ్యాపారం మారిన ప్రస్తుత పరిస్థితుల్లో వ్యాపారాన్ని సేవగా చేస్తున్న నాని ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తారు. విభిన్న, వైవిధ్య సామాజిక సేవాకార్యక్రమాల్లో తరిస్తున్న కొమ్మారెడ్డి నాని మంగళగిరి చరిత్రపుట్లో సుస్థిర స్థానం పొందుతారనడంలో ఎట్టి సందేహం లేదు

**– మాదిరాజు గోవర్ధనరావు, రచయిత న్యాయవాది**

### రాజకీయ రంగం... ప్రజాసేవే...

స్వీటు షాపు నిర్వహణ, సేవా కార్యక్రమాలలో మమేకమైన కొమ్మారెడ్డి సుబ్రహమణ్యం (నాని) దివంగత మహానేత ఎన్టీరామారావు స్ఫూర్తితో 2013లో రాజకీయ రంగప్రవేశం చేశారు. తెలుగుదేశం పార్టీ తరుపున 2014 మున్సిపల్ ఎన్నికల్లో 28వ వార్డు కౌన్సిలర్‌గా గెలుపొందారు. పట్టణంలోనే వెనుకబడిన ప్రాంతాలైన అంబేద్కర్‌నగర్, దాపనయ్యనరగ్‌లు ఉన్న ఆ వార్డులో మున్సిపల్ ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో నాని తనదైన శైలిలో విజయవంతంగా అభివృద్ధి పనులు చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధిగాను తన వార్డులో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో నాని పాలపంచుకుంటున్నారు.

# మిస్ వరల్డ్ మెక్సికో వెనెస్సా

**డబ్బు ఉన్నా.. పేదల కోసం రూపాయి వెచ్చించడానికి మనస్సురాని వారు ఎందరో ఉన్నారు. అయితే స్వచ్ఛంద సంస్థను నడపడం కోసం మోడలింగ్ వృత్తిని ఎన్నుకున్న సుగుణవతి మెక్సికో వెనెస్సా, ఆమె శరీరమేకాకుండా హృదయం కూడా అందమైనదే అని చెప్పడానికి ఇంకేమి కావాలి ? అందుకే ఈ ఏడాది ప్రపంచ సుందరి కిరీటం ఆమెకు దక్కింది.**



ఆమె



ఈ ఏడాది ప్రపంచ సుందరి కిరీటాన్ని మెక్సికోకు చెందిన యువతి దక్కించుకుంది. చైనాలోని సాన్యా ఎరెనాలో 68వ అందాల పోటీలను గత శనివారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ పోటీలో మెక్సికోకు చెందిన ప్రముఖ మోడల్ అండ్ వాలంటీర్ వెనెస్సా పోన్స్ డి లియోన్ గెలుచుకున్నారు. భారత అందాల సుందరి, 2017 మిస్ వరల్డ్ మానుషీ చిల్లర్ తన వారసురాలు డిలియోన్‌కు కిరీటాన్ని పెట్టి, అభినందనలు తెలిపారు. ఈ ఏడాది వివిధ దేశాల నుంచి 118 మంది సుందరీమణులు పోటీ పడగా, కిరీటం వనెస్సాను వరించింది. భారత్ నుంచి అనుకీర్తి వ్యాస్ అందాలపోటీలకు వెళ్లారు.

మిస్ మెక్సికో వానెస్సా ప్రోన్స్ డి లియోన్ వయస్సు 26. ఇంటర్నేషనల్ బిజినెస్ డిగ్రీ చేశారు. మైగ్రాంట్స్ ఎన్ ఎల్ కామినో, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ఆఫ్ ఏ రిహాబ్ సెంటర్ ఫర్ గర్ల్స్ సంస్థల్లో వాలంటీర్‌గా ఉన్నారు. 68వ అందాల పోటీల ఫైనల్స్ వేడుకలు డ్యాన్స్ పోటీలు ఉర్రూతలూగించాయి. అమెరికా స్టార్ డోనెల్ మంజేనా తన పాటలు, స్టెప్పులతో అలరించారు. వేదికపై మాజీ ప్రపంచ సుందరి మానుషీ ఛిల్లార్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గత ఏడాది ఆమె అందాల కిరీటాన్ని దక్కించుకున్నారు. 2018 విజేత వనెస్సా ధరించిన గౌన్ అందరినీ ఆకట్టుకుంది.

## నిర్లక్ష్యపు నీడల్లో అంగన్‌వాడీలు



(మొదటిపేజీ తరువాయి)

అందడం లేదు. సమగ్ర శిశు సంరక్షణ కార్యక్రమం (ఐసీడీఎస్) మార్గధర్శకాల ప్రకారం ఐదు వందల జనాభా దాటితే ఒక అంగన్‌వాడీ కేంద్రాన్ని, 300 లోపు జనాభా ఉంటే మినీ అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలి. ఒక్కో అంగన్‌వాడీ కేంద్రంలో ఒక వర్కర్, ఒక హెల్పర్, మినీ అంగన్‌వాడీ కేంద్రంలో మినీ వర్కర్‌ను నియమించాల్సి ఉంది. ఐసీడీఎస్ అమలులో భాగంగా గర్భిణులు, బాలింతలు, ఐదేళ్ళలోపు చిన్నారులుకు పౌష్టికాహారాన్ని అందిస్తూ చిన్నారులకు విద్యాబోధన అందించాలి. ప్రభుత్వం ఈ కార్యక్రమం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతోంది. అయితే ఈ లక్ష్యాలు పూర్తి స్థాయిలో అమలు కావాలంటే అందుకు అవసరమైన అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లను నియమించాలి. అవి అమలు చేయాలంటూ గతంలో సుప్రీంకోర్టు అదేశాలు సైతం ఇచ్చింది. కాగా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 55,607 ప్రధాన, మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో ఐదు వేలకు పైగా అంగన్‌వాడీ పోస్టులు ఖాళీగా ఉన్నాటు తెలుస్తోంది. వీటిలో అత్యధికంగా హెల్పర్ పోస్టులు 3,451 ఖాళీలుంటే 1,186 ప్రధాన అంగన్‌వాడీ వర్కర్లు 440 మినీ వర్కర్ల పోస్టులు ఉన్నాయి. ఖాళీలను భర్తీ చేయడంపై సర్కారు మీనమేషాలు లెక్కపెడుతోంది. మాతా శిశు సంరక్షణ ఈ కార్యక్రమంలో ప్రశ్నార్ధకంగా మారింది. పైగా వర్కర్ల నియామకం చేయకపోవడంతో పని చేస్తున్న వారిపైనే భారం పడుతోంది. గతంలో ఐసీడీఎస్ కార్యక్రమంలో భాగంగా ఫ్రీ స్కూల్ పోషకాహార కార్యక్రమాన్ని అమలు చేసేవారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం వాటితోపాటు అన్న అమృత హస్తం, బాలసంజీవని, ప్రత్యేక పోషకం వంటి పలు కార్యక్రమాలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీలపై పని భారం బాగా పెరిగింది. వీటితోపాటు ఆన్‌లైన్ పనులు, రికార్డుల నమోదు, పలకరింపు, సామూహిక సీమంతాలు తదితర కార్యక్రమాలతోపాటు ఇతర ప్రభుత్వ పనులు తమతో చేయిస్తున్నారని దీంతో భారం మరింత ఎక్కువ అయ్యిందని అంగన్‌వాడీలు వాపోతున్నారు. అలాగే బీఎల్‌వో, పలు రకాల సర్వే విధులు సైతం తమతోనే చేయిస్తుండడంతో మానసిక ఒత్తిడికి గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో ఒత్తిడి అధికమై పలువురు అంగన్‌వాడీలు అనారోగ్యాల పాలై మృతిచెందారని యూనియన్ నేతలు పేర్కొంటున్నారు. అలాగే పలు చోట్ల ఉన్న ఖాళీల్లో అధికార పార్టీ నేతల అనుయాయులకే కట్టబెడుతున్నారన్న ఆరోపణలు వెల్లవెత్తుతున్నాయి. ఇదే సమయంలో జనాభా పెరుగుతున్నా మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయటంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తోందని పలువురు వాపోతున్నారు. చాలా ప్రాంతాల్లో 1200 నుంచి 1500 మంది జనాభా ఉన్నప్పటికీ మినీ అంగన్‌వాడీ కేంద్రాలు అలాగే ఉంటున్నాయి. తప్ప అప్‌గ్రేడ్ కావటం లేదు. అందులో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పని ఒత్తిడిలో తీవ్ర ఇబ్బందులు ఎదురొంటున్నారు. ఇవికాక గ్రామదర్శిని, ఈ నేపధ్యంలో ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీ పోస్టులు భర్తీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## భారత్‌లో అమ్మకానికి రెడీ



**న్యూఢిల్లీ :** భారతీయ వినియోగదారులకు మొబైల్ మేకర్ వన్‌ప్లస్ గుడ్ న్యూస్ చెప్పింది. ఈ సంస్థ నుంచి వచ్చిన లేటెస్ట్ స్మార్ట్‌ఫోన్ వన్‌ప్లస్ 6టీ మెక్‌లారెన్ ఎడిషన్‌ను భారతీయ వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. 10 జీబీ ర్యామ్/256 జీబీ ఆన్‌బోర్డ్ మెమొరీ కలిగిన ఈ ఫోన్ చుట్టూ ఉన్న బొప్పాయి ఆరెంజ్ కలర్ స్ట్రిప్ ఫోన్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చింది. వన్‌ప్లస్ 6టీ మెక్‌లారెన్ ఎడిషన్ 10 జీబీ/256 జీబీ స్టోరేజీ వేరియంట్ ధర భారత్‌లో రూ.50,999. 8జీబీ

**వన్‌ప్లస్ 6టీ మెక్‌లారెన్ ఎడిషన్**

ర్యామ్/256 జీబీ వేరియంట్ ధర రూ.45,999. అమెజాన్ ఇండియా, వన్‌ప్లస్ ఇండియా వెబ్‌సైట్ల ద్వారా కొనుగోలు చేసుకోవచ్చు. వన్‌ప్లస్ ఆఫ్‌లైన్ స్టోర్ల ద్వారానూ అందుబాటులో ఉన్నాయి.

వన్‌ప్లస్ ఐదో వార్షికోత్సవం సందర్భంగా నేటి నుంచి ఈ నెల 24 వరకు వన్‌ప్లస్ 6టీ మెక్‌లారెన్ ఎడిషన్‌పై పలు ఆఫర్లు ప్రకటించింది. రూ.2 వేల క్యాష్ బ్యాక్‌తోపాటు యాక్సిస్ బ్యాంకు క్రెడిట్ కార్డులతో జరిపే లావాదేవీలపై రూ.1,500 క్యాష్ బ్యాక్ ఇవ్వనున్నట్టు తెలిపింది. ఆరు నెలల పాటు నో-కాస్ట్ ఈఎంఐ, వన్‌ప్లస్ పాత మొబైల్స్ ఎక్స్‌చేంజ్‌పై అదనంగా రూ.3 వేల రాయితీ, ఇతర ఫోన్లపై రూ.2 వేల వరకు తగ్గింపు ఇవ్వనున్నట్టు తెలిపింది.

## పెరిగిన నేరారోపణ సభ్యులు

**హైదరాబాద్ :** తెలంగాణలో కొలువుదీరిన కొత్త అసెంబ్లీకి ఎన్నికల్లో ఎన్నికైన 73 మంది ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు వెల్లడైంది. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) సంస్థ ఈ గణాంకాలను బయటపెట్టింది. రాష్ట్ర అసెంబ్లీకి మొత్తం 119 మంది ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారు. వారిలో 73 మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు నామినేషన్ పత్రాల్లో స్వయంగా వెల్లడించారు. అంటే మొత్తం ఎమ్మెల్యేల్లో 61 శాతం మందిపై ఈ కేసులున్నాయన్నమాట. గత అసెంబ్లీతో పోలిస్తే ఇప్పుడు నేరచరిత్ర గల ఎమ్మెల్యేల సంఖ్య 5 శాతం పెరిగింది. 2014లో 46 మంది ఎమ్మెల్యేలపై ఉన్నవి తీవ్రమైన కేసులు కాగా.. ఈ దఫా తీవ్రమైన కేసులున్న ఎమ్మెల్యేల సంఖ్య 47కు పెరిగింది. పార్టీల వారీగా చూస్తే టీఆర్ఎస్ కు చెందిన 50 మంది ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయి. 14 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై - ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేలపై - ఆరుగురు ఎంఐఎం ఎమ్మెల్యేలకు నేరచరిత్ర ఉంది. బీజేపీ తరఫున ఎన్నికైన ఏకైక ఎమ్మెల్యే రాజాసింగ్ కూడా తనపై క్రిమినల్ కేసులున్న సంగతిని స్వయంగా వెల్లడించారు. నామినేషన్ పత్రాల విశ్లేషణ ఆధారంగా ఏడీఆర్ తాజా గణాంకాలను విడుదల చేసింది. ఎమ్మెల్యే అభ్యర్థులు తమపై ఉన్న కేసుల వివరాలను స్పష్టంగా వెల్లడించాల్సిందేనని.. లేనిపక్షంలో అనర్హత వేటు తప్పదని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. తమ కేసుల వివరాలు తెలియజేస్తూ ప్రచార సమయంలో మీడియాలో అభ్యర్థులు ప్రకటనలు ఇవ్వాలని కూడా ఈసీ ఆదేశించింది. దీంతో ఆయా అభ్యర్థులపై కేసుల

**మధ్యప్రదేశ్‌లో 94 మంది**

**భోపాల్:** మధ్యప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో ఇటీవల గెలిచిన 230 మందిలో 94 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని వెల్లడైంది. వారిలో 47 మంది.. హత్య, హత్యాయత్నం, మహిళలపై దాడులు వంటి తీవ్ర నేరాల్లో ఉన్నారు. అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) తెలిపిన వివరాల ప్రకారం... ఇటీవల ఎన్నికైన ఎమ్మెల్యేల్లో ఆరుగురు తమపై హత్యాయత్నం చేశారని కేసులు నమోదయ్యాయి. ముల్తాయీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన సుఖ్‌దేవ్ పన్సె హత్య కేసును ఎదుర్కొంటున్నారు. మరో ముగ్గురు ఎమ్మెల్యేలు మహిళలపై దౌర్జన్యం, దాడులు (ఐపీసీ సెక్షన్-354, 498ఏ) వంటి కేసుల్లో ఉన్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న నేపథ్యంలో అభ్యర్థులు సమర్పించిన అఫిడవిట్‌లో ఈ వివరాలు పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన 114 మంది ఎమ్మెల్యేల్లో 56 (49 శాతం) మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. భాజపా నుంచి గెలిచిన 109 మంది ఎమ్మెల్యేల్లో 34 (31 శాతం) మంది క్రిమినల్ కేసులను ఎదుర్కొంటున్నారు. అలాగే, ఇద్దరు బహుజన్ సమాజ్ పార్టీ ఎమ్మెల్యేలు, ఒక సమాజ్ వాదీ ఎమ్మెల్యేపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఈ ఎన్నికల్లో గెలిచిన నలుగురు స్వతంత్ర అభ్యర్థుల్లో ఒకరిపై క్రిమినల్ కేసు ఉంది. కాంగ్రెస్ పార్టీ నుంచి మొత్తం 28 (25 శాతం) మందిపై నేరారోపణలు ఉంటే, భాజపా నుంచి 15 (14 శాతం) మంది ఉన్నారు. క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న ఇద్దరు బీఎస్పీ ఎమ్మెల్యేలు, ఒక సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యే, ఒక స్వతంత్ర అభ్యర్థి.. తీవ్ర నేరాల్లో ఉన్నవారే. కాగా, 230 మంది ఎమ్మెల్యేల్లో 187 (81 శాతం) మంది కోటీశ్వరులే ఉన్నారు. 2013లో ఎన్నికైన వారిలో 161 (70 శాతం) మంది కోటీశ్వరులు ఉన్నారు.

## వరుసగా మూడో రోజూ..

(మొదటిపేజీ తరువాయి)

కాపాడాల్సిన బాధ్యత కేంద్రంపైనే ఉందని.. పార్లమెంటు సాక్షిగా చేసిన చట్టం, ఇచ్చిన హామీలు అమలు చేయాలంటూ పెద్దఎత్తున నినదించారు. వారికి జతగా రాఫెల్ కుంభకోణంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) విచారణకు కాంగ్రెస్, వామపక్షాలు, ఇతర ప్రతిపక్షాల సభ్యులు.. కావేరి అంశంలో తమిళనాడు హక్కులను కాపాడాలంటూ అన్నాడీఎంకే ఎంపీలు నినాదాలు ఇస్తూ స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టారు. రాఫెల్ ఒప్పందంపై విచారణ అవసరం లేదని సుప్రీంకోర్టు అప్పటికే తీర్పు వెలువరించడంతో.. సభలో ఉన్న కేంద్ర మంత్రి థావర్‌చంద్ గెహ్లాట్ లేచి.. దీనిపై అనవసర ఆరోపణలు చేసిన కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సభ్యులు తీవ్ర అభ్యంతరం చెబుతూ ఆందోళన ఉధృతం చేశారు. టీడీపీ సభ్యులు కూడా వారికి అండగా నిలబడ్డారు. సభ్యులు తమ తమ స్థానాల్లో కూర్చోవాలని స్పీకర్ సుమిత్రా మహాజన్ పదేపదే చెప్పినా వారు వినలేదు. దీంతో మధ్యాహ్నం 12గంటల వరకు సభను వాయిదా వేశారు. తర్వాత తిరిగి ప్రారంభమైనా పరిస్థితిలో మార్పులేదు. కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ రాఫెల్‌పై మాట్లాడారు. సర్వోన్నత న్యాయస్థానమే ఎటువంటి అవకతవకలు లేవని, విచారణ అవసరం లేదని తేల్చిందని, ఇన్నాళ్లు ప్రజలను తప్పుదోవ పట్టించిన రాహుల్ క్షమాపణ చెప్పాలన్నారు. దాంతో విపక్ష సభ్యులు నిరసన స్వరం మరింత పెంచారు. గందరగోళం పెరగడంతో సభను స్పీకర్ సోమవారానికి వాయిదా వేశారు. అంతకుముందు పార్లమెంటు ఆవరణలో టీడీపీ ఎంపీలు తమ నిరసనలను కొనసాగించారు. గాంధీజీ విగ్రహం ఎదుట, పార్లమెంటు ప్రధాన ద్వారం ముందు ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.



**పేదలను ఆదుకోవడమే నిజమైన క్రిస్మస్. ఈ ఉత్సవాలు శాంతిదూత మినిస్ట్రీస్ వారి ఆధ్వర్యంలో మంగళగిరి పార్క్ రోడ్డు లోని సైమన్ వీధిలో ఈనెల 10వ తేదీ నుండి క్రిస్మస్ ఉత్సవాలు మరియు కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలికే ప్రత్యేక ఆరాధనా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి ప్రారంభ సభలో ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ గంజి చిరంజీవి కొమ్మారెడ్డి సేవాసమితి అధ్యక్షులు కే నాని కరుణాలయం అనాధాశ్రమం ఇంచార్జ్ సిస్టర్ ఉష మినిస్ట్రీస్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు జనవరి ఒకటవ తేదీ వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతాయి ఈ మేరకు శాంతిదూత మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు పాల్గొన్నారు.**

## కాలమ్

### ఓ మిత్రుడు ఇచ్చిన అద్భుతమైన వాట్స్ యాప్ సందేశం

ఇది చదవండి కాదు...కాదు... ఆచరించండి

మీ జీవితంలో మార్పుకోసం

- కొద్దిగా నీరసంగా ఉంది..
- కొద్దిగా బద్ధకంగా ఉంది..
- కాసేపు పడుకోవాలనిపిస్తోంది.
- కాసేపాగి పనిచేసుకోవచ్చులే...
- ఇప్పటికిప్పుడు కొంపలేం మునిగి పోవట్లేదు కదా..

నీకు నువ్వు ఇచ్చుకునే ఈ ఆటో సజిషన్స్ ని నువ్వు ఎప్పుడైనాగమనించావా? హ్యూమన్ బ్రెయిన్ చాలా గొప్ప ఎగ్జిక్యూటర్. మీరు అనుకున్న వన్నీ తూ. చ. తప్పకుండా చేస్తుంది.

నిద్ర వస్తోంది అనుకోండి...అప్పటి నుండే ఆవలింతలు మొదలవుతాయి. ఇవాళ రిలాక్స్ అయి రేపు పనిచేద్దాంలే అనుకోండి..వెంటనే సాకులు వెదికిపెట్టి మనం కంఫర్టబుల్‌గా రిలాక్స్ అయ్యేలా చేస్తుంది...

బ్రెయిన్ ప్రోగ్రామింగ్......ఓ గొప్ప సబ్జెక్ట్....ప్రతీ క్షణం మన థాట్ ప్రాసెస్‌ని గమనించుకుంటూ మన బ్రెయిన్‌ని సిస్టమాటిక్‌గా పెట్టుకుంటూ అవుట్‌పుట్‌ని సమీక్షించుకుంటూ చేయాల్సిన పని!..ఒక్క క్షణం కమిట్ అవ్వు.. "నేను ఏది ఏమైనా ఈ పని చేస్తానని"!

నెక్స్ట్ మినిట్ నీ చావు రాసి పెట్టి ఉన్నా మొదట నువ్వు అనుకున్న పని చేశాకే చచ్చిపోతావు. అది మన గొప్పదనం కాదు. మన బ్రెయిన్ గొప్పదనం....

నువ్వు ఏదనుకుంటే అది చేసి చూపెడుతుంది.

అందుకే ఎప్పుడూ గొప్పగా ఆలోచించు.....

నువ్వు ఇప్పటికిప్పుడు కష్ట పడతానంటేనీ ఆవలింతలను..నీ నిద్రనీ....నీ బద్ధకాన్నీ...నీ జలుబునీ...నీ జ్వరాన్నీ.....నీ చుట్టూ ఉండే అన్ని, అన్ని డిసప్పాయింట్‌మెంట్లనీ పక్కన పడేసి నీ బ్రెయిన్ నీ పని మీద ఫోకస్ చెయ్యడం మొదలు పెడుతుంది. గుర్తుంచుకో..... నీబ్రెయిన్‌కి... ఫీడ్ ఇవ్వాల్సింది..... నువ్వే! నీ లైఫ్..నీ గమ్యం కోసం నీ బ్రెయిన్‌ని సిద్ధపరుచుకో !చుట్టూ చెత్తఉంటే నేను ఫోకస్ చెయ్యలేకపోతున్నాను..అనకు. బురదలో పద్మం పుట్టుకొస్తే దాని విలువ మాటల్లోచెప్పలేం. అంతా క్లీన్‌గా పాజిటివ్ గా ఉంటే నువ్వేంటి.. ప్రతీ ఒక్కరూ సాధించగలరు. నీ చుట్టూ ఉండే బలహీనతలను దాటుకుని నువ్వెలా ఎదిగావన్నదే నీగొప్పదనం. ఆల్ ది బెస్ట్!!!

## రైలు ప్రయాణికులకు ప్రత్యేక యాప్!




**హైదరాబాద్ :** ప్రయాణికులకు నాణ్యమైన సేవలు అందించేలా సరికొత్త మార్పులకు నాంది పలుకుతున్న భారతీయ రైల్వే మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'రైల్ మదద్' పేరుతో మొబైల్ యాప్‌ను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. రైలులో ప్రయాణించేవారు ఈ యాప్ సాయంతో తమకు ఎదురైన సమస్యలపై ఫిర్యాదులు చేయవచ్చు. ఫిర్యాదు చేసిన వెంటనే దానిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారనే అంశంపై సంబంధిత సమాచారం పొందే వీలుంటుంది.

దేశంలోనే అత్యున్నత రైల్వే అతిపెద్ద ప్రజా రవాణా వ్యవస్థ. కోల్‌కతాలో ఉన్న మెట్రో రైల్వే వ్యవస్థతో కలిపి దేశంలో మొత్తం 17 రైల్వే జోనల్ వ్యవస్థలు ఉన్నాయి. నిత్యం 3 కోట్లకు పైగా ప్రజలు రైళ్లలో ప్రయాణిస్తున్నారు. ప్రయాణించే సమయంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను రైల్వే అధికారుల దృష్టికి తీసుకురావడంతో వాటిని రైల్వే అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు. ఇప్పటికే దక్షిణ మధ్య రైల్వే ట్విటర్ ఖాతాను ఏర్పాటు చేసి వాటిలో వచ్చిన సమస్యలకు స్పందిస్తుంది. 138 నంబర్‌తో సాధారణ హెల్ప్‌లైన్, భద్రత కోసం 182, పిల్లల కోసం 1098, మహిళల కోసం 1091, రైలు ప్రమాదాలకు సంబంధించి 1072, కోచ్ శుభ్రం కోసం 58888, కేటరింగ్ ఫిర్యాదుల కోసం 1800111321, విజిలెన్స్ కోసం 155210 హెల్ప్‌లైన్ నంబర్లను రైల్వే శాఖ ఏర్పాటు చేసింది.

తాజాగా ప్రయాణికుల కోసం రైల్వే ఆధునిక సాంకేతిక వ్యవస్థను తీసుకువచ్చింది. ప్రయాణికుల సమస్యలను పరిష్కరించేందుకు 'రైల్ మదద్' పేరుతో మొబైల్ యాప్‌ను రైల్వే శాఖ అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ సదుపాయం కోసం ప్రయాణికులు తమ చరవాణీల్లో గూగుల్ ప్లే స్టోర్‌లోకి వెళ్లి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఈ యాప్ ద్వారా రైళ్లలో, స్టేషన్లలో జరిగే ఘటనలు, సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చు. ఆధారాల కోసం ఫొటోను యాప్‌లో అప్‌లోడ్ చేసుకోవడంతోపాటు రైల్వే అధికారులకు సూచనలు, సలహాలు ఇవ్వవచ్చు. సమస్యపై ఫిర్యాదు చేసిన వెంటనే ఎలాంటి చర్యలు తీసుకున్నారనే వివరాలు మన చరవాణికి యునిక్ ఐడీ ద్వారా వస్తుంది. కేవలం యాప్ ద్వారానే కాక వెబ్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

ప్రయాణికుల ఆదరణను మరింత పెంచుకోవడంతోపాటు వారికి సౌకర్యవంతమైన సేవలు అందించేలా రైల్వే శాఖ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానికి పెద్దపీట వేస్తోంది. రైల్ మదద్ యాప్ ద్వారా రైళ్లల్లో, స్టేషన్లలో ఉండే సమస్యలు, జరిగే ఘటనలపై ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేందుకు వీలు పడుతుంది.


## రాజధాని క్లాసిఫైడ్స్

### నివాస ప్లాట్లు

**రాయపూడి**
రాజధాని ప్రాంతంలోని రాయపూడి గ్రామ పరిధిలో 500, 1000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9908244333

నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

### ఇతరములు

ఓం్రశ్రీ సాయిరాం రిజిస్ట్రేషన్ కన్సల్‌టెన్సీ & సర్వీసెస్ అన్ని రకముల దస్తావేజులు, అగ్రిమెంట్లు వ్రాయబడును. స్టాంపులు అమ్మ బడును. అన్ని రకముల మోటారు వాహనములకు ఇన్సూరెన్స్ కట్టించు కొనబడును.
**పాపన చక్రవర్తి డాక్యుమెంట్ రైటర్**
ఫోన్ 9502424704, 08645 244992
సబ్ - రిజిస్ట్రార్ ఆఫీస్ ఎదురు, తుళ్లూరు

వెలగపూడి
సాయి గణేష్ ట్రేడర్స్: నిర్మాణ రంగానికిసిమెంట్, స్టీలు, పైపులు, పెయింట్‌లు అమ్మబడును.
ఫోన్ : 9640811333

**మందడం**
ఎస్.ఆర్.కె. గ్రాండ్ రెస్టారెంట్
ఫోన్ : 9553023388

**వెంకటపాలెం**
సాయిలాస్య రియల్ఎస్టేట్ & ఫైనాన్స్ కన్సెల్టెన్సీ, గాదె నాగేశ్వరరావు
ఫోన్ : 95151 53939

### షాప్స్

**తుళ్ళూరు**
వైభవ్ డ్రస్సెస్
ఫోన్ : 9848407935

తుళ్ళూరు
విజయలక్ష్మి జనరల్ స్టోర్స్
మీకు కావలసిన నాణ్యమైన నిత్యావసర వస్తువులు
ఫోన్ : 94414 11432

### హస్పటల్స్

**విజయవాడ**
ఆంధ్ర హస్పటల్,
డా॥శ్రీమన్నారాయణ
ఫోన్ : 9177219900

విజయవాడ
న్యూఫేస్ కీనిక్ , డా॥మేహబూబ్
ఫోన్ : 9849122788

విజయవాడ
అష్రఫ్ మెటర్నిటీ & ఇ.ఎన్.టి
డా॥ రెహమాన్
ఫోన్ : 0866-2475087

విశాఖపట్నం
చింతలూరు ఆయుర్వేద
డా॥ విశ్వనాథ్
ఫోన్ :90329 90138

### విద్యా సంస్థలు

**ఐనవోలు**
విఐటీ-ఏపీ యూనివర్శిసిటీ
ఫోన్ :0863 2370444

**నీరుకొండ**
ఎస్ఆర్ఎమ్ యూనివర్శిసిటీ
ఫోన్ :0863 2343000

### వాణిజ్య ప్లాట్లు

**నవులూరు**
రాజధాని ప్రాంతంలోని నవులూరు గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

**ఐనవోలు**
రాజధాని ప్రాంతంలోని ఐనవోలు గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9908244333

నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

**గమనిక : క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారులు చెబుతున్నట్లుగా చేసుకుంటున్న క్లెయిముకుగాని ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసి ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.**

**- మేనేజర్**

ప్రకటనలకు సంప్రదించండి 7680994755







**మంగళగిరి నుండి అమరావతి రాజధాని ప్రాంతానికి వెళ్లే మార్గంలో ఉన్న డంపింగ్ యార్డ్ దశాబ్దాలుగా పాలకులను అధికారులను అవహేళన చేస్తోంది ఈ సమస్యకు పరిష్కారం కనుగొన లేక పాలకులు అధికారులు నానా తంటాలు పడుతున్నారు ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే పరిసర ప్రాంతాల ప్రజలు అనారోగ్యం పాలయ్యే పరిస్థితులు ఏర్పడతాయని ఆరోగ్య శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు నిడమర్రు రోడ్డు లో ఉన్న ఈ డంపింగ్ యార్డును వెంటనే తరలించాలని ప్రజలు కోరుతున్నారు. - రాజధాని వార్తలు**

# మొఘలుల కాలంలో క్రిస్మస్ సంబరాలు

**దేశరాజధాని ఢిల్లీలో ఎక్కడ చూసినా క్రిస్మస్ హడావుడే కనిపిస్తోంది. కానీ ఇది ఇప్పుడు మొదలైంది కాదు... మొఘల్ చక్రవర్తి అక్బర్ కాలంలోనే ఈ సంస్కృతి మొదలైంది.మధ్యలో ఔరంగజేబు పాలనలో ఈ పండగను జరపడం ఆగిపోయినా ఆ తర్వాత షా ఆలమ్ వరకూ ఇది కొనసాగింది.**







మొఘలుల కాలంలో ఆగ్రా అద్భుత నగరం. యూరోపియన్లు ఇక్కడికి వస్తే నగర అందాలు, భవంతులు, యమునా నదిని చూసి పర్యాటకులు పులకించిపోయేవారని థామస్ స్మిత్ అనే రచయిత పేర్కొన్నారు. ఇటలీ నుంచి నగల వర్తకులు, పోర్చుగీస్, డచ్‌కు చెందిన ఓడల యజమానులు, ఫ్రెంచ్ యాత్రికులు, మధ్య ఆసియా, ఇరాన్‌లకు చెందిన వ్యాపారులు, కళాకారులు, విద్యావేత్తలు తరచూ ఇక్కడ పర్యటించేవారు. ఇలా ఎన్నో దేశాలవారు ఆగ్రాకు రావడంతో ఆ రోజుల్లోనే క్రిస్మస్‌కు ఇక్కడ ప్రాధాన్యం ఏర్పడింది.

భారత్‌లో మొఘలుల పాలన కన్నా ఎన్నో సంవత్సరాల క్రితమే మధ్య ఐరోపాలో క్రీస్తు పుట్టుకపై వీధి నాటకాలు వేసేవారు. ఆ తర్వాత అక్బర్ ఓ క్రిస్మస్ పండుగ సందర్భంగా క్రైస్తవ మత పెద్దలను ఆగ్రాకు ఆహ్వానించారు. అలా ఆగ్రాలో క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. పండుగ నాడు మార్కెట్లు, వీధులన్నీ పండగ కళను సంతరించుకునేవి. వివిధ రకాల లైట్ల కాంతుల్లో ఎన్నో దేశాల జెండాలు నగరమంతా రెపరెపలాడేవి. సంగీత వాయిద్యాల మోతలు, బాణసంచాల పేలుళ్లు, చర్చి గంటల శబ్దాలతో మారుమోగిపోయేది. ఆ వెలుగుల్లో ఆగ్రా మరింత అందంగా కనపడేది. నగరంలో ఓ పెద్ద చర్చిని నిర్మించుకునేందుకు అక్బర్ ఆనాడే క్రైస్తవులకు అనుమతినిచ్చారు. ఆ చర్చికి అమర్చిన ఓ పెద్ద గంట తర్వాత జహంగీర్ కాలంలో ఊడి పడిపోయింది.

**అక్బర్, ఆ తర్వాత జహంగీర్... ఇద్దరూ క్రిస్మస్ రోజున ఆగ్రా కోటలో క్రైస్తవులతో కలసి భోజనం చేసేవారు. అక్బర్ తన పరివారంతో సహా చర్చికి వచ్చి, క్రైస్తవ మత పెద్దలను కలుసుకునేవారు.రాణివాస స్త్రీలు కూడా సాయంత్రం సమయంలో చర్చికి వెళ్లి కొవ్వొత్తులను అందజేసేవారు.**

ఇలా ప్రతి సంవత్సరం చేసేవారు. ఒకరిపై ఒకరు అసూయపడే ఐరోపా క్రైస్తవుల కూడా ఆ రోజున మాత్రం ఈర్ష్యాద్వేషాలు పక్కన పెట్టి కలిసి మెలిసి క్రిస్మస్‌ను జరుపుకునేవారు. చీకటి పడిన తర్వాత చిన్నపిల్లలకు దేవకన్యలుగా వేషం వేసి, క్రీస్తు పుట్టుక గురించి నాటకాలు వేయించేవారు. బ్రిటిష్ పాలకుల కార్యాలయం ఉన్న ఫులాట్టి బజార్లో దీనికి సంబంధించిన రిహార్సల్స్ జరిగేవి. ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా అక్బర్, జహంగీర్ కాలంలో సైనికుల్ని కూడా ఏర్పాటుచేసేవారు.

పోర్చుగీసు వారితో ఘర్షణల కారణంగా 1632లో షాజహాన్ ఈ చర్చిని కూలగొట్టించాడు. అంతేకాకుండా బహిరంగంగా ప్రార్థనలు చేయకూడదంటూ క్రైస్తవులపై నిషేధం విధించాడు. మళ్లీ 1640లో పోర్చుగీసువారితో స్నేహపూర్వక వాతావరణం ఏర్పడటంతో ఈ నిషేధాన్ని సడలించి, మళ్లీ చర్చిని నిర్మించుకునేందుకు అనుమతించారు. ఆగ్రాలో ఇప్పుడున్న చర్చి అప్పుడు నిర్మించినదే. తర్వాత కాలంలో కూడా షా ఆలమ్, అక్బర్ షా సైనీ, బహదూర్ షా జాఫర్ చక్రవర్తులు కూడా క్రిస్మస్ పండుగను అప్పటి ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారులతో కలసి జరుపుకున్నారు. కానీ రాత్రిపూట నాటకాల్ని మాత్రం క్రైస్తవ మత పెద్ద డొమినిక్ ఆర్థాయిడ్ మళ్లీ 1958లో పునరుద్ధరించాడు.ఆనాటి చక్రవర్తులు ఇప్పుడు లేకపోయినా, వారు అందించిన మత సామరస్య భావాలు మాత్రం ఇంకా ఆగ్రాలోనే కాదు, దేశమంతా నిండి ఉన్నాయి.

**ఆనాటి చక్రవర్తులు ఇప్పుడు లేకపోయినా, వారు అందించిన మత సామరస్య భావాలు మాత్రం ఇంకా ఆగ్రాలోనే కాదు, దేశమంతా నిండి ఉన్నాయి.**

### అక్బర్ చర్చి

ఉత్తరభాతర దేశంలో పాత చర్చిల్లో ఒకటి అక్బర్ నిర్మించిన చర్చి. 1600 సంవత్సరం సొసైటీ ఆఫ్ జీసస్ ఆధ్వర్యంలో ఈ చర్చి నిర్మాణం జరిగింది. దీంతో ఉత్తర ప్రదేశ్ లోని లక్నో క్రైస్తవులకు ప్రాముఖ్యత పెరిగింది. ఇప్పటికీ అనేకమంది పర్యాటకులు ఈ చర్చిని సందర్శిస్తుంటారు. ఈ చర్చిలోని అంతర్గత, బాహ్య అందానికి వారంతా ముగ్ధులవుతుంటారు. ఇది ఆగ్రాలోనే మొదటి రోమన్ కథోలిక్ చర్చి. క్రైస్తవ్యం గురించి తెలుసుకోవడం కోసం అక్బర్ గోవా నుంచి జెస్యూట్ ఫాదర్లను పిలిపించారు. అక్బర్ తర్వాతి కాలంలోని మొఘలి రాజులు చర్చి విస్తరణను చేపట్టారు. 1848 వరకు ఈ చర్చి కేథడ్రల్‌గా ఉంది.

### సెయింట్ తోమా చర్చి

దేశంలోని అతి పురాతనమైన చర్చి సెయింట్. థామస్ సైరో- మలబార్ కేథలిక్ చర్చి. కేరళలోని పశ్చిమ తీరప్రాతం త్రిస్సూర్ జిల్లాలో పలయుర్‌లో యేసుక్రీస్తు 12 మంది శిష్యుల్లో ఒకరైన సెయింట్. తోమా ఈ చర్చిని నిర్మించారు. క్రీ.శ 52లో నిర్మించిన ఈ చర్చి భారతదేశంలోనే మొదటి చర్చి. ఇక్కడే నుంచే భారతదేశంలో ఆయన క్రీస్తును గూర్చిన ప్రచారాన్ని మొదలు పెట్టారు. కొట్టక్కవలో ఆయనే నిర్మించిన రెండవ చర్చి ఉత్తర పరావుర్‌లో నిర్మించిన లోని మేరీ తోమా అపోస్తలిక్ చర్చి. ఆయన హయాంలో క్రాంగనోర్, కొక్కమంగళం, కొత్తకవ్వు, కొల్లాం, నిరనం, చాయల్ (నిలక్కల్)లో మరో ఆరు చిన్న చర్చిలను నిర్మించారు. ఈ చర్చిలకు 17వ శతాబ్దంలో విస్తరణ పనులు చేపట్టారు.

– ఖాన్


# కెమిస్ట్రీ టీచర్ పెళ్లి పత్రిక


వాస్తవానికి పెళ్లిపత్రికలో వధూవరుల పేర్లు వారి తల్లిదండ్రులు, ఎక్కడ పెళ్లి జరుగుతుంది ? ముహూర్తం ఎన్నిగంటలకు? విందు ఎక్కడ అనే అంశాలతో ఉంటుంది. ధనవంతులు ఆడంబరంగా పెళ్లిపత్రికలో బహుమతులను కూడా ఉంచే సంస్కృతి ప్రస్తుతం పెరుగుతోంది. అయితే దీనికి భిన్నంగా ఒక కెమిస్ట్రీ లెక్చరర్ పెళ్లిపత్రికను ప్రచురించడంతో ఇది వైరల్ అయింది. వివరాల్లోకి వెళితే... కాంగ్రెస్ నాయకుడు, మాజీ కేంద్రమంత్రి శశి థరూర్ సొంత నియోజకవర్గమయిన తిరువనంతపురానికి చెందిన విధున్ అనే కెమిస్ట్రీ ఉపాధ్యాయురాలి పెళ్లి డిసెంబర్ 14న జరిగింది. ఆమె ఆమె కెమిస్ట్రీ టీచర్ కావడంతో తన పెళ్లి పత్రికను వినూత్నంగా డిజైన్ చేయించింది.

ఆర్గానిక్ కెమిస్ట్రీలోని బెంజీన్ ఆకారంలో ఉండే రసాయబంధనాలను గుర్తుకు తెచ్చే విధంగా పెళ్లి పత్రికను డిజైన్ చేయించింది. దాంతోపాటు 'లవ్' అనే ఆంగ్ల పదాలను జోడించి, ఆ రెండు బందాలను కలుపుతూ, వధూవరులు పేర్లను అందులో రాసి అచ్చు వేయించింది. అలా డిజైన్ చేసిన పెళ్లి పత్రికను ఫొటో తీసి సోషల్ మీడియా ఉంచింది. దీంతో కార్తిక్ అనే నెటిజన్, ఈ ఆహ్వాన పత్రికను ట్విట్టర్‌లో శశిథరూర్‌కు ట్యాగ్ చేయడంతో పెళ్లి పత్రిక వైరల్ అయింది. ఆమె క్రియేటివిటీపై కామెంట్ల వర్షం కురిసింది. ఆపెళ్లి పత్రిక మీకోసం..

### శశి థరూర్ ట్వీటు

వధూవరులు కలకాలం సుఖసంతోషాలతో వర్ధిల్లాలి. వారిద్దరి మధ్య కెమిస్ట్రీ (రసాయినిక చర్యలు) నిత్యనూతనంగా వెలుగొందాలని, భవిష్యత్‌లో వారి భౌతిక చర్యలు వేడిని కాకుండా, వెలుగుగా ఉండాలని, వారి జీవశాస్త్రం ఫలించి ఉదారవాద వారసులతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షిస్తూ.. ఆయన ట్వీట్ చేశారు.



# కేసీఆర్ బలం ఆయనే..

**తెలంగాణాలో టీఆర్ఎస్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టారని, కేసీఆర్‌కు ఎదురేలేదని భావిస్తే పొరపాటే.. వాస్తవానికి టీఆర్ఎస్‌పై అభిమానంతో రాష్ట్ర ప్రజలు ఓట్లు వేయలేదు. కేవలం చంద్రబాబుపై ఉన్న అక్కసుతోమాత్రమే వారు ఓట్లు వేశారన్నది గుర్తుంచుకోవాలి. అంటే టీఆర్ఎస్ బలం చంద్రబాబే అన్నమాట. చంద్రబాబు కూటమిలో ఉండి ఉండకపోతే ఫలితం మరో విధంగా ఉండేదనడంలో సందేహం లేదు. సీపీఐ నాయకుడు చాడా వెంకటరెడ్డి, టీజేఎస్ అధినేత కోదండరామ్ కాంగ్రెస్ వెనుక తిరిగి తమ అమూల్యమైన సమయాన్ని నిరుపయోగం చేసుకున్నారు. ఎప్పుడైతే టీడీపీతో కాంగ్రెస్ పొత్తుపెట్టుకుందో అప్పుడే వారు తప్పుకుని ఉంటే గౌరవంగా ఉండేది. సీపీఎం మాత్రం కాంగ్రెస్- బీజేపీలతో కలవబోమని ముందే భీష్మించుకొని కూర్చొని మర్యాద కాపాడుకుంది.**

వాస్తవానికి రాజకీయపార్టీలకు ఎన్నికల్లో విజయం రెండు విధాలుగా చేకూరుతుంది. ఒకటి ఆయా పార్టీలు చేపట్టిన ప్రజాసంక్షేమంతోపాటు, ఎన్నికల హామీలను అమలు చేసేదానిపై ఆధారపడి ఉండగా రెండోది ప్రత్యర్థి పార్టీలపై ప్రజలకుండే వ్యతిరేకత కూడా ఆపార్టీ గెలుపుకు దోహదపడుతుంది. దేశవ్యాప్తంగా నోట్లరద్దు, జీఎస్టీ అమలు వంటి మోడీ చేసిన ప్రజావ్యతిరేక పనులతోపాటు, గోరక్షక దళాల పేరుతో అరాచకవాదం విజృంభించడంతో రాజస్థాన్, మధ్యప్రదేశ్ , చత్తీస్‌గఢ్‌ల్లో (మిజోరంలో కాంగ్రెస్ నుంచి మిజోరం నేషనల్ ఫ్రంట్ అధికారం చేజిక్కించు కుంది)బీజేపీ వ్యతిరేక పవనాలు వీయగా, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తెలంగాణాలో కాలుపెట్టడంతో ప్రాంతీయవాదం తలెత్తి ప్రజలు స్థానిక పాలన కోసం ప్రజలు ఓట్లు వేశారు. లాలూ ప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలోని రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ), ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నేతృత్వంలోని జనతాదల్ యునైటెడ్ ( జేడీయూ), కాంగ్రెస్‌లు 2015 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మహాగద్బంధన్ పేరుతో కూటమిగా ఏర్పడి బీజేపీని తరిమికొట్టాయి. (ఆ తర్వాత ఆర్జేడీ,కాంగ్రెస్‌లకు బై..బై చెప్పి నితీష్‌కుమార్ బీజేపీ పంచన చేరారు) దీన్ని ప్రేరణగా తీసుకొని ఏడాది క్రితం ఉత్తరప్రదేశ్‌లో మాయావతి నేతృత్యం వహిస్తున్న బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ), అఖిలేష్ యాదవ్ ఆధ్వర్యంలోని సమాజ్‌వాదీ (ఎస్పీ) పార్టీలు కలసి (కాంగ్రెస్‌లేకుండానే) బీజేపీని స్థానిక ఎన్నికల్లో ఓడించాయి. ఇదే ఫార్ములాను అనుకరిస్తూ తెలుగుదేశం అధినేత చంద్రబాబు కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నారు. దేశవాప్తంగా బీజేపీకి వ్యతిరేకత పెరుగుతున్న విషయాన్ని ఆయన ముందే పసిగట్టి పంథా మార్చినప్పటికీ ప్రజలు ఆయన ప్రయత్నాన్ని తిప్పికొట్టారు. ఒక్కమాటలో చెప్పాలంటే కేసీఆర్ విజయంలో చంద్రబాబు ఉన్నారన్నది సుస్పష్టం. ప్రజాకూటమి ఏర్పటుకు ముందు తెలంగాణ అధికార ఎమ్మెల్యేలు వారి నియోజక వర్గాల్లో కాలుపెట్టంగానే స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. మా ప్రాంతానికి ఏమి సౌకర్యాలు కల్పించారని ప్రజలు ప్రజాప్రతినిధులను నిలదీశారు. టీఆర్ఎస్ పాలనపై సామాజిక మాధ్యమాల్లో కామెంట్లు విస్తృతంగా వైరల్ అయ్యాయి. కేసీఆర్ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని కేసీఆర్ తాగుబోతు.. కుమారుడు తిరుగుబోతు.. అల్లుడు ఆంబోతు.. మనవడు తిండిబోతు వంటి కామెంట్లు, చరిత్రను తిరగరాసిన కేసీఆర్ హెడ్డింగ్‌తో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయకుండా, ఒక్క కాంట్రాక్టు ఉద్యోగిన కూడా క్రమబద్ధీకరించకుండా, గ్రూప్1-2 పోస్టులను భర్తీ చేయకుండా, ఒక్క ప్రాజెక్టు పూర్తిచేయకుండా, తెలంగాణాకోసం ఆత్మాహుతి చేసుకున్న వారికి టికెట్ ఇవ్వకుండా, మంత్రులెవరినీ మాట్లాడనీయకుండా, ఒక్కడే రాజరికంలో రాజులా, గడీలో దొరలా నిరకుశంగా చరిత్రను రాశారన్న పోస్టింగులు పెద్దఎత్తున సామాజిక మాధ్యమాల్లో ట్రోల్ అయ్యాయి. ఎప్పుడైతే చంద్రబాబు అక్కడ కాలుపెట్టారో.. కేసీఆర్ తన నిరాహార దీక్షను, (ఎంతమంది ఆహుతయ్యారో చెప్పనేలేదు) ఎందరి చుట్టూ తిరిగిందీ .. ఇంతకష్టపడితే మళ్లీ ఆంధ్రోళ్లకు అధికారం కట్టబెడ్తామా అంటూ ప్రాంతీయ వాదాన్ని రెచ్చకొట్టగానే పరిస్థితి మారిపోయింది. ఆయన చేసిన ప్రాంతీయ వాద ప్రసంగాలో, కార్యసిద్ధి యాగం వల్లో ( కేసీఆర్ రాష్ట్ర విభజన కోసం యజ్ఞం, స్థానికల ఎన్నికల సమయంలో చండీయాగం నిర్వహించిన విషయం తెలిసిందే) అంతకుముందుకంటే ఎక్కువ సీట్లు వచ్చాయి. దీంతో వాస్తవాలను గ్రహించకుండా అంతా తనగొప్పే అంటూ రాష్ట్రరాజకీయాలను కుమారుడు కేటీఆర్‌కు వదిలి కేసీఆర్ కేంద్రానికి వెళ్లతాననడం వాపును చూసి బలం అనుకోవడమే అవుతుంది. కేంద్రంలో ఇప్పటికే అనేక మంది ఉద్దండులు ప్రధాని పదవిపై ఆశపెట్టుకొని కూర్చున్నారు. వారిలో నేషనల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన శరద్‌పవార్, బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ( రాజకీయాల్లో ఆమెకు క్లీన్ చిట్ ఉంది) ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతి ,యూపీని కుమారుడుకి వదిలిన మరో మాజీ ముఖ్యమంత్రి సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు ములాయంసింగ్ వంటి వారు చాలా మంది ఉన్నారు. వీరందరినీ పక్కకు తప్పించి ముందుకు పోవడం అంత తేలిక కాదు.. మరో ముఖ్యవిషయం అసలు ఓట్లకంటే తెలంగాణాలో అధిక ఓట్లు పోలయ్యాయన్నది నిజం.. అధికారంలోని టీఆర్ఎస్ తన గెలుపుకోసం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ ఈ బరితెగింపుకు పాల్పడ్డారు. **అందుకు ఉదాహరణగా ధర్మపురి నియోజక వర్గంలో మొత్తం పోలైన ఓట్లు 1,65,209 ఆ నియోజక వర్గంలో బరిలోనిలిచిన 11 మందికి కలసి పోలైన ఓట్లు 1,65,747 అంటే 538 ఓట్లు అదనంగా నమోదు అయ్యాయి. ఇన్ని అక్రమాలు లోక్‌సభ ఎన్నికల్లో పాల్పడటం కుదరదు కనుక ప్రధాని అవడం అంత తేలికకాదని చెప్పవచ్చు.**

అయితే మళ్లీ ఏదో జపం చేస్తే ఖచ్చితంగా పీఎం అవుతారని జ్యోతిష్కులు చెప్పారని ఒక పత్రిక కథనం. వాస్తు, జ్యోతిష్యంపై అపార నమ్మకం ఉన్న కేసీఆర్ వాటిని పవిత్రంగా పాటిస్తారనుకోవడంలో సందేహం లేదు. (తెలంగాణ రాష్ట్రం వస్తే తిరుమల తిరుపతి వెంకన్నకు చెల్లిచాల్సిన మొక్కులు కూడా ప్రజాధనంతో తీర్చారని ఆరాష్ట్రంలో రచ్చయింది.) అయితే అన్నీ అనుకున్న విధంగా జరగవు.. వాస్తవానికి కేసీఆర్ హయాంలో కంటే కాంగ్రెస్ హయాంలోనే హైదరాబాద్ రోడ్లు బాగుండేవి. ప్రజలు దానిపై గొంతుపెగల్చకుండా చంద్రబాబు అడ్డుపడ్డారని మర్చిపోకూడదు. మన ఉద్యోగాలన్నీ ఆంధ్రోళ్లు దోచుకుపోతున్నారని తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులను రెచ్చగొట్టిన కేసీఆర్‌ను ఇప్పటివరకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో తేల్చండి మీ ఇంట్లో వారికేనా ఉద్యోగాలన్నీ అని ఒక్క ప్రతిపక్షం కూడా నిలదీయకపోవడం ఆయనపాలిట వరంగా మారింది. పరిస్థితులు కేసీఆర్‌కు అనుకూలంగా మారి ఒకవేళ ప్రధాని పదవి చేపట్టినా ఆ క్రెడిట్ చంద్రబాబు ఖాతాలోనే చేరుతుంది. ఎందుకంటే ఒకసారి మంత్రి పదవి ఇవ్వనందుకు రాష్ట్రాన్ని ముక్కలు చేసి ముఖ్యమంత్రి అయ్యారు. రెండోసారి చంద్రబాబు ఆయన రాష్ట్రంలో కాలు పెట్టినందుకు ప్రతీకారంగా ప్రధాని అయ్యారని చెప్పుకోవాల్సి వస్తుంది.

– బోసు

## ఫిబ్రవరి 8న 'యాత్ర'




'మహానటి' చిత్రం సూపర్ హిట్ అవ్వడంతో బయోపిక్ లకు తెలుగులో మంచి ఆదరణ లభించే అవకాశం ఉందని తేలిపోయింది. అందుకే ఇప్పటికే పలు బయోపిక్‌లు రెడీ అవుతున్నాయి మరి కొన్ని బయోపిక్‌లు తెరరూపం దాల్చబోతున్నాయి. ఇక వైఎస్ రాజశేఖర్ రెడ్డి బయోపిక్ ను మహి వి రాఘవ దర్శకత్వం చేస్తున్నాడు. భారీ అంచనాలున్న ఈ బయోపిక్‌ను మొదట డిసెంబర్ లో విడుదల చేయాలని భావించారు. కాని చిత్రీకరణ ఆలస్యం అవ్వడం వల్ల వాయిదా వేశారు.సంక్రాంతికి ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారని ఆ తర్వాత రిపబ్లిక్ డేకు సినిమాను విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లుగా వార్తలు వచ్చాయి. ఆ వార్తలన్ని కొట్టి పారేస్తూ తాజాగా చిత్ర యూనిట్ సభ్యులు అధికారికంగా ఈ విషయమై ప్రకటన చేశారు. వైఎస్ బయోపిక్ 'యాత్ర' మూవీని ఫిబ్రవరి 8న ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేందుకు సిద్ధమయినట్లుగా అధికారిక ప్రకటన వెలువడింది.

తెలుగుతో పాటు తమిళం మరియు మలయాళంలో కూడా అదే రోజున విడుదల చేయబోతున్నట్లుగా ప్రకటించారు. మళయాల సూపర్ స్టార్ మమ్ముటి ఈ చిత్రంలో వైఎస్ పాత్రను పోషించగా కీలక పాత్రల్లో జగపతిబాబు సుహాసిని నటించారు. ఈ చిత్రంలో జగన్ పాత్రను ఎవరు పోషించారనే విషయమై సస్పెన్స్ కొనసాగుతోంది. భారీ అంచనాల నడుమ రూపొందిన ఈ చిత్రంను విజయ్ చిల్లా మరియు శశిదేవి రెడ్డిలు నిర్మించారు. వైఎస్ అభిమానులతో పాటు అన్ని వర్గాల వారిని ఈ చిత్రం అలరిస్తుందనే నమ్మకాన్ని చిత్ర యూనిట్ సభ్యులు వ్యక్తం చేస్తున్నారు.

## సంక్రాంతి రేసులో ఎన్టీఆర్




ఇంకా సమయం ఉన్నప్పటికీ సినిమా ప్రేమికుల కళ్ళు జనవరిలో రాబోయే సంక్రాంతి సీజన్ మీదే ఉన్నాయి. క్రేజీ స్టార్ హీరోల సినిమాలు ఈ సారి వరసబెట్టి క్యూ కట్టడంతో ట్రేడ్ వర్గాలు సైతం కోట్లాది రూపాయల పెట్టుబడులతో పెద్ద గేమ్ ఆడబోతున్నాయి. ఎవరికెవరు తీసిపోరు అనే స్థాయిలో ఉండే హీరోలు బ్యానర్లు దర్శకులు కావడంతో ఇది ఎక్కువ ఇది తక్కువ అనే ఛాన్స్ ఈ సారి లేకుండా పోయింది. ముందుగా వస్తున్న ఎన్టీఆర్ మాత్రం ఫస్ట్ అడ్వాంటేజ్ తీసుకోవడానికి సిద్ధంగా ఉంది. జనవరి 9న రిలీజ్ కానున్న ఎన్టీఆర్ మీద బాలకృష్ణ అభిమానులే కాదు సగటు ప్రేక్షకుడు కూడా చాలా ఆశిస్తున్నాడు. క్రిష్ దర్శకుడు కావడం పోస్టర్ల రూపంలో చేసిన పబ్లిసిటీ మంచి హైప్ ఇవ్వడం ఇవన్నీ ప్లస్ గా మారాయి. వంద కోట్ల దాకా ఓవరాల్ బిజినెస్ జరిగినట్టు టాక్ ఉంది.ఇక మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తేజ్ వినయ విధేయ రామ అవుట్ అండ్ అవుట్ మాస్ మసాలా సినిమా కావడంతో పాటు రంగస్థలం లాంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత వస్తున్న సినిమాగా అంచనాలు మాములుగా లేవు. కనివిని ఎరుగని రేట్లకు ఇప్పటికే అమ్ముడుపోయినట్టు సమాచారం. వెంకటేష్ వరుణ్ తేజ్ ల ఎఫ్2 మొన్నటి దాకా సైలెంట్ గా ఉందే అనిపించినా ఒక్క టీజర్ మొత్తం వాతావరణాన్ని మార్చేసింది. చాలా రోజుల తర్వాత మంచి కామెడీ ఎంటర్ టైనర్ చూడబోతున్న ఫీలింగ్ అందులో కలగడంతో ఫ్యామిలీ ఆడియన్స్ మొదటి ఆప్షన్ గా ఇదే ఉంటుందన్న నిర్మాత దిల్ రాజు అంచనా నిజమైనా ఆశ్చర్యం లేదు. హ్యాట్రిక్ డైరెక్టర్ అనిల్ రావిపూడి పనితనం మీద ప్రేక్షకులకు సైతం మంచి నమ్మకం ఉంది. సో సంక్రాంతి రేస్ లో ఎవరో ఒకరా లేక అందరా విజేతలుగా ఎవరుంటారు అనేదే ఆసక్తికరంగా మారింది. ఒకవేళ మూడు పాజిటివ్ గా ఉన్నా సమస్య లేదు. సెలవుల సీజన్ కాబట్టి బాగున్నాయి అంటే అన్ని ఆడతాయి. కాకపోతే ఎవరికి ఎంత ఓపెనింగ్ వచ్చింది అనే లెక్కలు కీలకంగా మారతాయి. వినయ విధేయ రామ జనవరి 10 ఎఫ్2 జనవరి 12గా డేట్స్ ఫిక్స్ అయ్యాయనే టాక్ ఉంది కానీ యూనిట్స్ నుంచి ఇంకా అధికారికంగా వెలువడాల్సి ఉంది.

## 28న కలెక్టర్ల సమావేశం

**రాజధాని ప్రతినిధి – అమరావతి :** ప్రతినెలా కలెక్టర్ల సమావేశాన్ని నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈనెల 28న ఉండవల్లిలోని ప్రజావేదికలో కలెక్టర్ల సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్ సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2016-18, Cell 7680994755, Email : rajadhanivartalu1@gmail.com